: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

విజయవాడ

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

16-8-2026
ఆదివారం
సంపుటి: 32
సంచిక: 197
పేజీలు: 10+4
వెల: 8.00




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం అమరావతిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సిఎం చంద్రబాబు, సిఎస్ సాయి ప్రసాద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా



శనివారం ఎర్రకోట నుండి జాతినుద్దేశించి స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగం చేస్తున్న ప్రధాని మోడీ

ఏడు రంగాల వృద్ధితో దేశం సుసంపన్నం

మావోయిజాన్ని అంతం చేయగలిగాం

డిజిటల్ యుగంలో చిప్‌లకు పెరిగిన ప్రాధాన్యం

కరోనా, యుద్ధాలను దాటి ముందుకు వచ్చాం

దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్

గత పన్నెండేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ

# వికసిత్ భారత్‌కు 'సప్తధార'

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామని భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తి వంతం చేస్తామని ప్రధానిమోడీ అన్నారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్‌అనే ఏడుధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. నేడు ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోందని ప్రధాని పేర్కొన్నారు. 80వ భారత స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో శనివారం ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితమే స్వాతంత్రం అని వివరించారు. తొలిసారిగా ఎర్రకోట వద్ద వందే మాతరం గీతాన్ని ఆలపించామని అన్నారు. దేశం కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదుగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చు >>2

# చేతిలో జాతీయ జెండా.. గుండెలో బలమైన అజెండా

విధ్వంసం నుండి వికాసం వైపు అడుగులు, ఇక వైభవం వైపు ప్రయాణం

శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత అవసరం

80వ స్వాతంత్ర్య వేడుకల్లో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:**మన చేతిలో జాతీయ జెండా ఉండాలి, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారందేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చిందన్నారు. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలని సూచించారు. దేశం నాకు ఏం చేసిందని కాదు, దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 యేళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య వేడుక జరిగే వేదిక వద్దకు సిఎం కాన్వాయ్‌తో పాటు బుల్లెట్ ఎస్కార్టు వచ్చింది. డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సిఎంకు స్వాగతంపలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాలు ముఖ్యమంత్రికి గౌరవవందనం సమర్పించారు. ఎపిఎస్పీ సహా >>2

# ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని..

## అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం: మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరం కలిసి స్వర్ణాంధ్ర సాధనకు ప్రతిన బూనుదామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రోజు దేశం అంతా ఒక్కటే పండుగ. కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు. అందరూ కలిసి జరుపుకునే ఒకే ఒక్క పండుగ జెండా పండుగ. ఈ రోజు దేశం మొత్తం జాతీయ జెండా గర్వంగా ఎగురుతుంది. ఆ జెండా మనందరి గుండె చప్పుడు. జెండా పండుగ నాకు ఒక పర్సనల్ ఎమోషన్. ఇక్కడ విద్యార్థులను చూసిన తర్వాత నా స్కూల్ డేస్ >>2



మహిళలతో బస్సులో ప్రయాణిస్తున్న సిఎం చంద్రబాబు

# 'స్త్రీ శక్తి'కి నీరాజనం

మహిళలు వివిధ రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం అండ

మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించిన సిఎం చంద్రబాబు

వారి కుటుంబ పరిస్థితులపై ఆరా

**విజయవాడ.ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** స్త్రీలు స్వయం శక్తి రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మహిళల సామాజిక, ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 'స్త్రీ శక్తి'కి యేడాది రెట్టింపైన ఆత్మగౌరవం పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రాజధానిలోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ మీదుగా సిఎం క్యాంప్ కార్యాలయం వరకు మహిళలతోకలిసి సిఎం బస్సులో ప్రయాణించారు. ప్రయాణంలో >>2








శనివారం అమరావతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పోలీసు అధికారులకు, మహిళా అధికారులకు అవార్డులు అందజేస్తున్న సిఎం చంద్రబాబు







శనివారం అమరావతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డులు పొందిన శకటాలు

# గుండెలో బలమైన అజెండా

>> వివిధ పోలీసు దళాల సన్నద్ధతను సిఎం సమీక్షించారు. పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సిఆర్‌పిఎఫ్, కర్ణాటక పోలీసు దళం మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగునేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఎపి ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు అవుతుందని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్‌గా, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీ, డీప్ టెక్ క్యాపిటల్‌గా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మాణమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత కావాలని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం మనల్ని ఐక్యం చేసిందని, స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు.

**10 సూత్రాలతో విజన్ సాకారం**

రాష్ట్రంలో 3 ప్రాంతాలు ఎదిగి, ప్రతీ జిల్లా ప్రగతి సాధించటమే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సామాజిక న్యాయం జరిగినప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి లక్ష్యం కోసం 10 సూత్రాలు రూపొందించుకున్నామని సిఎం అన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత ఫార్మర్ అగ్రిటెక్, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అనే ఈ 10 సూత్రాలతో విజన్ సాకారం చేద్దామని చంద్రబాబు ఆకాంక్షించారు. లక్ష్యాలకు తగ్గ కార్యాచరణలో భాగంగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి యూనిట్‌గా తీసుకుని విజన్ యాక్షన్ ప్లాన్‌లు రూపొందించామన్నారు. 201419 మధ్య 13.5 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధి రేటు, 201924 మధ్య 10.3 శాతానికి పడిపోయిందని విమర్శించారు. అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడంతో వృద్ధి రేటు 11.3 శాతానికి పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రాష్ట్రంలో అర్హులందరికి 2029 నాటికి అందరికీ ఇళ్లు**

నవ్యాంధ్ర యువ ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. యువత కలలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం సృష్టించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అద్భుతాలు సృష్టించాలని సూచించారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సాయం అందేలా ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలో చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని సిఎం వెల్లడించారు. తల్లికివందనం సాయాన్ని ఖర్చులా చూడకుండా పిల్లల భవిష్యత్‌పై పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. బిసిలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా ఎస్సీలు కోరుకున్న వర్గీకరణను అమలు చేశామన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూముల్లో ఎన్నో యేళ్లుగా నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

**శాంతిభద్రతలతోనే అభివృద్ధి:**

అభివృద్ధి కావాలంటే శాంతియుత వాతావరణం ఉండాలి అన్నారు. పెట్టుబడులు రావాలంటే భద్రత కావాలి. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలి. అందుకే పోలీసులకు ప్రజా భద్రతలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం అన్నారు. విజిబుల్ పోలీసింగ్....ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాంపోలీసు శాఖలో టెక్నాలజీ... డ్రోన్లు.. విస్తృతంగా వినియోగిస్తున్నాం. వీటి ఫలితాలు కనిపిస్తున్నాయి అన్నారు. నేరస్తులను వేగంగా గుర్తించడంతో పాటు, అంతే వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటాం. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే. అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాం. పోలీసుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇచ్చాం. వారికి రూ.427 కోట్ల బకాయిలు చెల్లించాం అన్నారు.

**స్వాతంత్రం నుంచి స్వర్ణాంధ్ర వరకు**

స్వాతంత్రం మనకు హక్కులు ఇచ్చిందని సిఎం అన్నారు. స్వర్ణాంధ్ర మనకు, మన పిల్లలకు బంగారు భవిష్యత్ ఇస్తుంది. స్వాతంత్రం మనకు అవకాశాలు ఇచ్చింది. స్వర్ణాంధ్ర ఆ అవకాశాలను ఆర్థిక శక్తిగా మారుస్తుంది. స్వాతంత్రం మనల్ని ఐక్యం చేసింది...స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుంది. 2024లో రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రారంభించాం. 2047 నాటికి అంతా గర్వించే స్వర్ణాంధ్రను నిర్మిద్దాం. ఇది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు. ఇది ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం కావాలని పిలుపునిస్తున్నాను. ఇది మన పిల్లల భవిష్యత్ కోసం మన బాధ్యత. ఇది మన తరానికి వచ్చిన చారిత్రక అవకాశం. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేశాం. ఇక వికాసం నుంచి వైభవం వైపు ప్రయాణిద్దాం. సంక్షోభం నుంచి స్థిరత్వానికి వచ్చాం స్థిరత్వం నుంచి స్వర్ణాంధ్ర వైపు సాగుదాం..ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఆత్మవిశ్వాసంతో... అంకితభావంతో ప్రతి రోజూ పనిచేద్దాం అన్నారు.. మన సంకల్పం ఒక్కటే...భారత్ ప్రపంచంలో నంబర్‌వన్ కావాలి. ప్రపంచంలో తెలుగుజాతి నెంబర్ వన్‌గా నిలవాలి వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం! స్వర్ణాంధ్రను సాధిద్దాం అంటూ ప్రసంగం ముగించారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న శకటాల ప్రదర్శనలో అవార్డులు

**విజయవాడ.ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి,. సంక్షేమ రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులను వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన నిర్వహించారు. భాషా, సాంస్కృతిక శాఖ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఇంధన శాఖ, రవాణా శాఖ, ఎపిఎస్‌ఆర్టీసీ, మహిళలు, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, జల వనరుల శాఖ, పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష, ఉన్నత విద్యా శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, చేనేత, జౌళి శాఖ, ఎపిసిఆర్‌డిఎ, అమరావతి, గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు, పరిశ్రమల శాఖ, ప్రణాళిక శాఖ, దేవాదాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, గనులు, భూగర్భ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ వంటి దాదాపు 25 శాఖల నుండి వచ్చిన శకటాల ప్రదర్శనలో వికసిత భారత్ నిర్మాణంలో విద్యా విప్లవం అంటూ సాగిన విద్యా సమగ్ర శిక్ష శకటానికి, ఉద్యానవన శాఖల శకటానికి సంయుక్తంగా ప్రథమ బహుమతి లభించింది. ద్వితీయ బహుమతిగా నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న చేనేత, జౌళి శాఖకు లభించింది. అడవులను రక్షించండి, వన్య ప్రాణులను కాపాడండి అంటూ హరితాంధ్ర లక్ష్యంగా చేసుకుని సాగిన అటవీ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ శాఖలు, పోలీసు, భద్రతా బలగాలు ప్రదర్శించిన క్రమశిక్షణ, ప్రతిభ, రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. విజేతలుగా నిలిచిన బృందాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. అయితే, ఈ కార్యక్రమం అనంతరం శకటాలను రాజధాని ప్రాంత గ్రామాల్లో ప్రదర్శించారు. శనివారం మధ్యాహ్నం నుంచి మల్కాపురం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయ పాలెం గ్రామాల్లోని ప్రధాన రహదారుల మీదుగా శకటాల ప్రదర్శన కొనసాగింది. రంగురంగుల అలంకరణ లతో రూపొందించిన శకటాలు గ్రామాల మీదుగా సాగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వీటి ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శకటాలపై ప్రదర్శించిన తీరు పలు గ్రామస్థులను ఆకట్టుకుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా శకటాల ప్రదర్శన సాగడంతో ప్రజలకు సమాచారం చేరువైనట్లయింది. వీటిని తిలకించేందుకు రాజధాని గ్రామాల ప్రధాన రహదారులపైకి పెద్ద సంఖ్యలో ప్రజలు పోటెత్తారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం నిర్వహించిన ఈ శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ‘స్త్రీశక్తి’కి నీరాజనం

>> మహిళల యోగక్షేమాలు, కుటుంబ స్థితిగతులను ఆయన ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి హైటీ (తేనేటి విందు) కార్యక్రమంలో పాల్గొని, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో సిఎం ముఖాముఖి మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభించి నేటితో యేడాది అయింది... ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలు జరిగాయని సిఎం అన్నారు. వివిధ ప్రాంతాలకు ఉచితంగా మహిళలు వెళ్లే వెసులుబాటు కల్పించాం అన్నారు. ఈ పథకం ద్వారా మహిళల డబ్బులను ఆదా చేసుకోగలుగుతున్నారు అన్నారు. రాబోయే రోజుల్లో అందరి ఆదాయం పెరగాలి.. అందరి ఆరోగ్యం బాగుండాలి. అప్పుడే అందరూ సంతోషంగా ఉంటారుఅన్నారు. దీన్ని నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బాగా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం అన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజారోగ్యం బాగుండేందుకు తీసుకో వాల్సిన ఆహారాన్ని కూడా ప్రచారం చేస్తున్నాం. మహిళలు అంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేది.. కానీ ఇప్పుడు ఇది రివర్స్ అయింది అన్నారు. మహిళలే ఎక్కువగా సంపాదించే పరిస్థితివచ్చింది అన్నారు. సంజీవని వంటి పథకాలతో ప్రజారోగ్యం కోసం పని చేస్తున్నాంఅన్నారు. వీటితో పాటు.. ఆర్థిక పరిస్థితులు మెరుగపడేలా వివిధ రకాల పథకాలను అందిస్తున్నాం అన్నారు.

**ఆర్థికంగా ప్రగతి సాధించాలి.**

పి4 పథకం ద్వారా కూడా పేద కుటుంబాలకు చేయూతనిచ్చేలా మార్గదర్శులను ముందుకు తెస్తున్నాం అన్నారు. నేనుఅనే సంకల్పం తీసుకుని ప్రతి ఒక్కరూ పని చేయాలి అన్నారు. డ్వాక్రాసంఘాలను తెచ్చాను.. ప్రోత్సహించాను. అన్నారు. రూ.25వేలకోట్లు డ్వాక్రా సంఘాలద్వారా పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉంది. అన్నారు. తీసుకున్న బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లింపులు జరుపుతారు అన్నారు. కొన్ని పెద్ద కంపెనీలు కూడా రుణాలను ఎగవేస్తున్నాయి.. డ్వాక్రా మహిళలు మాత్రం తీసుకున్న రుణాలను ఠంచనుగా చెల్లింపులు జరిపారు అన్నారు. గంజాయి నిర్మూలనకు, అవగాహన పెంచేందుకు మహిళలు చొరవ తీసుకోవాలి. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిని మహిళలు ఓ కంట కనిపెడుతూ ఉండాలి అన్నారు.

**రూ.3,095 కోట్ల సబ్సిడీ 87 కోట్ల ప్రయాణాలు**

ఈ పథకం ద్వారా గడిచిన యేడాది కాలంలో మహిళలు రికార్డు స్థాయిలో 87 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని సిఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 24లక్షలమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్ల సబ్సిడీ భరిస్తోందని తెలిపారు. యేడాదికాలంలో మొత్తం రూ.3,095కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని వివరించారు. ఆర్టీసీలోని మొత్తం 9,978 బస్సులకు గాను, 7,631 బస్సుల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. మొత్తం ఆర్టీసీలోని 76 శాతం బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు అవుతోందని సిఎం తెలిపారు.

**హార్షం వ్యక్తం చేసిన మహిళలు**

మహిళలతో మాట్లాడుతూ.. వారి కుటుంబ వివరాలు.. ఆర్థిక స్థితిగతులను అడిగి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి ఓట్లేయించుకునే వారిని నమ్మొద్దన్న సిఎం చంద్రబాబు హితవు చెప్పారు.. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకూడదని మహిళలు ప్రచారం చేయాలన్నారు..రాబోయే 10 యేళ్లలో ఏయే లక్ష్యాలను నిర్దేశించుకున్నారంటూ సిఎం ప్రశ్నలు....కోటి రూపాయల పెట్టుబడితో తన డ్వాక్రా సంఘం నుంచి వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపిన కడప జిల్లా ముస్లిం మహిళ. .ఏఐ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా తాను ఎంచుకున్న సాఫ్ట్ వేర్ రంగంలో టాప్ పొజిషనులోకి వెళ్లాలని వివరించిన విశాఖకు చెందిన ఓ ఉద్యోగిని...స్త్రీ శక్తి ద్వారా సుమారు రూ. 3 వేలు ఆదా చేసుకోగలుగుతున్నామని తెలిపిన యువతి.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలే ఎక్కువగా సంపాదిస్తున్నారని... తాము కూడా మరికొందరికి ఉపాధి చూపగలుగుతున్నామన్న పలువురు మహిళలు.. అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని కోరిన మహిళలు.. రాజధానిలో మహిళల పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశించారు.

## బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి పర్యటన ఖరారు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** బిజెపిప జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి పర్యటన ఖరారు. ఆగస్టు 17 నుంచి 21 వరకు 5 రోజుల పాటు ఎపిలో పర్యటించనున్న నితిన్ నబీన్ ఆగస్టు 17 సాయంత్రం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. విశాఖలో నితిన్ నబీన్‌కు బిజెపి నేతలు, కార్యకర్తల ఘన స్వాగతం పలుకుతారు. ఆగస్టు 18 ఉదయం సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీ నరసింహా స్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం విశాఖలో జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర పదాధికారులతో సమావేశం అవుతారు.

# ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని..

>> గుర్తొచ్చాయి. ఇండిపెండెన్స్ డే వస్తుంది అనగానే స్కూల్‌లో హడావుడి ఉండేది. ఫ్రెండ్స్ అంతా కలిసి క్లాస్ రూమ్స్, స్కూల్‌ని డెకరేట్ చేసేవాళ్లం. స్కూల్‌లో పెట్టే కాంపిటీషన్స్ కోసం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర గురించి స్టడీ చేసేవాళ్లం. ఫైనల్‌గా ఎవరైనా గెస్ట్ వచ్చి జెండా ఎగరేసినప్పుడు గూస్ బంప్స్ వచ్చేవి. జనగణమనఅంటూ జాతీయగీతం పాడుతూ.. జాతీయజెండా ఎగరడంచూసినప్పుడు చాలా గర్వంగా ఉంటుంది. మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనే కాదు.. ఈ రోజు ప్రతి భారతీయుడి గుండెల్లో జాతీయ జెండా ఎగురుతుంది అన్నారు.

**యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం..**

ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత నాకు ఇస్తే.. దేశ తలరాతను మారుస్తానని స్వామి వివేకానంద అన్నారు. ఇప్పుడు నేను అదే ఫాలో అవుతున్నా. నాలుగేళ్లు ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగం రాదు. నాలుగు నెలలు అమీర్ పేటలో కోచింగ్ తీసుకుంటే ఉద్యోగం వస్తుంది. అదే స్కిల్ గ్యాప్. అందుకే నేను పరిశ్రమలు కాలేజీలను అనుసంధానిస్తున్నాం. పరిశ్రమలు మన ఐటిఐలను అడాప్ట్ చేసుకుని వాళ్లకు కావాల్సిన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఉద్యోగాలు వెంటనే వస్తాయి. అలానే ఉన్నత విద్యను కూడా ప్రక్షాళన చేస్తున్నాం. కరిక్యులమ్ మార్చాం. ఇన్నేళ్లుగా లేని ప్రొఫెసర్ రిక్రూట్ మెంట్ చేస్తున్నామని తెలిపారు.




శనివారం విజయవాడలో స్వాతంత్ర్య ఏడుకల్లో భాగంగా జెండా ఎగురవేస్తున్న మంత్రి లోకేష్

**అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం..**

ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం. పెన్షన్, తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకార భరోసా అందిస్తున్నాం. అన్నా క్యాంటీన్లు ఏర్పాటుచేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. పదివేల పోస్టులతో జాబ్ కేలండర్ విడుదల చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ప్రతి వంద రూపాయల పెట్టుబడుల్లో ఎపికి రూ.25 వస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది నా ఆశయం అన్నారు.

## వారం - వర్జ్యం

16-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
చవితి సా.4.58 న.హస్త రా.3.52
వ.మ.12.00-మ.1.37
దు.సా.4.46-సా.5.37
రాహు సా.4.30-సా.6.00
శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృషభం :** ఇంటిలో తల్లి ఆరోగ్యం కొంత కలవర పెడుతుంది. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**మిథునం :** శాస్త్ర, సాంకేతిక విషయాల యందు ఆసక్తి చూపుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** పట్టుదలతో ముందుకు సాగి పనులు పూర్తి చేస్తారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలు.

**సింహం :** పారిశ్రామిక, రాజకీయ రంగాల వారు అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. మిత్రుల కలయిక.

**కన్య :** ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇంటా బయటా అనుకూలం.

**వృశ్చికం :** సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. వస్తు కొనుగోలు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**ధనుస్సు :** సన్నిహితుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. వస్త్ర లాభం.

**మకరం :** భూ సంబంధిత వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం :** సోదరుల నుండి స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు. మిత్రుల కలయిక.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వికసిత్ భారత్‌కు ‘సప్తధార’

>> నని ప్రధాని మోడీ తెలిపారు. సంకల్పం, కలలు ఉన్నతంగా ఉంటే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇవాళ ప్రపంచమంతా భారత్‌వైపు చూస్తోందన్నారు. శౌచాలయాలు 4 రెట్ల వేగంతో నిర్మించామని, పేదలకు ఇళ్లు 3 రెట్ల వేగంతో నిర్మించామని తెలిపారు. దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెరిగాయని, ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యమని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని అన్నారు.

**డిజిటల్ యుగంలో పెరిగిన చిప్ ప్రాముఖ్యం....**

డిజిటల్ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ వస్తువుల్లో చిప్ ప్రాముఖ్యత పెరిగిందని వివరించారు. సెమీకండక్టర్ల రంగంలో స్వావలంబన దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మూడు ప్రధాన సెమీకండక్టర్ ప్లాంట్లు కార్యకలాపాలు చేపట్టాయని గుర్తు చేశారు. ఏడెనిమిదేళ్లలో దాదాపు 8 సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రధాని మోడీ తెలిపారు. 200 గిగావాట్ల అణు ఇంధనం ఉత్పత్తి మన లక్ష్యమన్నారు. ఐదు అణు రియాక్టర్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తుమ్మని చెప్పారు. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్ అందిస్తున్నామని వివరించారు. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం అని నొక్కి చెప్పారు. దేశాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరంకాదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. 12 యేళ్లలో అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని గుర్తు చేశారు. రైల్వే కోచ్, మొబైల్ ఫోన్ల తయారీ పెరిగిందని వివరించారు. డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరిగాయని గుర్తు చేశారు. రైల్వే విద్యుదీకరణను 30 నుంచి వందశాతానికి పెంచామన్నారు. తొలి హైడ్రోజన్ రైలును కూడా ప్రారంభించామని వివరించారు. అనేక చట్టాలను మార్చామన్నారు.

**కరోనాతర్వాత యుద్ధాలు ముంచేసాయి..**

కరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా నుంచి బయటపడగానే యుద్ధాలు ముంచేశాయని పేర్కొన్నారు. ముందు ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు ఇరాన్ యుద్ధం అని వివరించారు. యుద్ధాలు వస్తే ఇంధనం, ఎరువులు దొరకవని కొందరు భయపెట్టారని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు లోటు రానివ్వలేదని చెప్పారు. సంక్షోభం వస్తుందని ముందే ఊహించి ముందస్తు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. యూరియా, డిఎపి ధరలు పెరిగినా ఇక్కడ సబ్సిడీకి ఇస్తున్నామని పేర్కొన్నారు. భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. 2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్‌లు చేశామని గుర్తు చేశారు. మన టెక్స్‌టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోందని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. భారత్ నుంచి రక్షణ రంగ ఎగుమతులు పెరగాలని ఆకాంక్షించారు. గత 12 యేళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు పెరిగిందన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి 5 రెట్లు పెరిగిందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 33 రెట్లు పెరిగిందని వివరించారు. భారత్ 6జీ టెక్నాలజీని ప్రపంచమంతా తీసుకెళ్లాలని తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో భారత్ నుంచి 50 సంస్థలు ఉండాలని ప్రధాని మోడీ ఆకాంక్షించారు.

**నక్సలిజాన్ని అంతంచేసాం...**

దేశంలో నక్సలిజాన్ని అంతమొందించామన్నారు. నక్సలిజం, మావోయిజం ఎంతోమంది యువకులను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో ఎంతమంది సైనికులు చనిపోయారో నక్సలిజంతో అంతమంది పోలీసులు చనిపోయారని పేర్కొన్నారు. నక్సలిజం భావజాలం ఉన్నవారిని కట్టడి చేయాల్సి ఉందన్నారు. కానీ దేశంలో చాలామంది మావోవాదులు ఉన్నారని చెప్పారు. వారి మనసుల్లో మావోయిజం, నక్సలిజం ఇంకా ఉందని తెలిపారు. అలాంటి వారిని కనిపెట్టి నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

మహిళా రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు కలిసి రావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోటా అందాల్సి ఉందన్నారు. మహిళా బిల్లుకు సహకరించి ఆ ఘనత మీరే తీసుకోవాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధిలో జనగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. పథకాల రూపకల్పనకు జనగణన సమాచారం కీలకమని అభివర్ణించారు. జనగణనకు యువత సహకరించాల్సి ఉందన్నారు. జనగణన నమోదులో తప్పులు లేకుండా చూడాలని అందుకోసం యువతకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామని ప్రధాని మోడీ వివరించారు.

# డి.సిఎం పవన్‌కు అస్వస్థత

## ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన వైనం

### ఫిజియో థెరపీ కోసం కేరళకు వెళ్లే అవకాశం

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరం కారణంగా ఈ సాయంత్రం లోక్ భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. ఈ విషయాన్ని లోక్ భవన్ అధికారులకుకూడా సమాచారం అందించారు. కాకినాడలో 80వ స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న అనంతరం పవన్ రాజమహేంద్రవరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఆ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే త్వరగా ముగించారు. అక్కడ వైద్యులు ఉపముఖ్యమంత్రిని పరీక్షించారు. కొంత ఉపశమనం కలిగిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఇటీవల పవన్ కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగిన సంగతి విదితమే. శస్త్ర చికిత్స అనంతరం ఫిజియో థెరపీ గురించీ వైద్యులను కలవనున్నారు. కాకినాడలో జరిగిన కార్యక్రమాల్లో పవన్ పాల్గొన్నప్పుడు కొంత అసౌకర్యంగా కనిపించారు. జాతీయ పతాకానికి సెల్యూట్ చేసిన తర్వాత అలాగే వాహనంలో అభివాదం చేసిన తర్వాత కూడా భుజాన్ని చేతితో నొక్కుకున్నారు. ఆయనకు జ్వరంకూడా ఉన్నట్లు కార్యాలయవర్గాలు వెల్లడించాయి. పవన్ ఫిజిథేరపిలో భాగంగా వచ్చేవారంలో కేరళవెళ్లే అవకాశాలున్నాయి. ఇటీవలే ఆయన భుజానికి శస్త్రచికిత్స అనంతరం వేసిన కట్టుతీసారు. ఆ తరువాత కొన్ని ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఆయన కేరళకు వెళ్లే అవకాశం ఉంది.

## అత్యంత ఎత్తయిన ఇయు పర్వతం అధిరోహించిన ఏలూరు ఎస్ఐ



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎపికి చెందిన ఓ పోలీస్ అధికారి వినూత్న రీతిలో జరుపుకున్నారు. రాష్ట్రంలోని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు యూరప్‌లోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి, అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. రష్యాలో ఉన్న 5,642 మీటర్ల ఎత్తైన ఈ శిఖరంపైకి ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం) ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించి తన దేశభక్తిని చాటుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన తోటి పోలీసు సిబ్బందికి తన ఈ ఘనతను అంకితం ఇస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. పర్వతారోహణపై ఆసక్తి ఉన్న ఆయన, ఈ యాత్ర కోసం కఠినమైన శారీరక, మానసిక శిక్షణ పొందారు. గతంలో కూడా ఆయనకు పలు శిఖరాలను అధిరోహించిన అనుభవం ఉంది. మౌంట్ ఎల్బ్రస్‌ను విజయవంతంగా అధిరోహించిన ఆయన, తన తదుపరి లక్ష్యం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమేనని ప్రకటించారు.



శనివారం జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

# దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే

## శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ క్రొయ్యే మోషేన్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. భారతదేశ భవిష్యత్తు యువత శక్తి, ప్రతిభ, నైపుణ్యాలపై ఆధారపడి ఉందని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించిన పద్మలత

**విజయవాడ.ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్సీ పీసీఆర్ సభ్యురాలు కేజీ పద్మలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ వేడుకలలో ఏపీఎస్సీ పీసీఆర్ సభ్యులు చల్లా మధుసూదన రావు, కమిషన్ సిబ్బంది మల్లీశ్వరి, పెద్దిరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

# కాలుష్య నియంత్రణకు మరిన్ని విద్యుత్ బస్సులు

## దాతల భాగస్వామ్యంతో పలు ప్రాజెక్టులు

## విజయవంతం: టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమలక్షేత్రంలో పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు విద్యుత్ బస్సులను పెద్దఎత్తున ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. దేశవిదేశాల నుండి ఇష్టదైవమ్ శ్రీవారి దర్శనార్థం ప్రస్తుతం తిరుమలకు 10 వేల నుండి 14 వేల వరకు వాహనాలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ అత్యంత అవసరమన్నారు. దాతల సహకారంతో మరో 37 విద్యుత్ బస్సులను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రానున్న బ్రహ్మోత్సవాలకు సుమారు 25 విద్యుత్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. గత ఐదు నెలల్లో లగేజ్ కౌంటర్ల ద్వారా సుమారు 2.6 కోట్ల బ్యాగులను సమర్థవంతంగా డిపాజిట్ డెలివరీ చేసినట్లు అదనపు ఇఒ తెలిపారు. టిటిడి సాధిస్తున్న విజయాలు ఏ ఒక్క వ్యక్తివి కాదని, ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి, ప్రతి భాగస్వామి సమష్టి కృషి ఫలితమని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్పష్టం చేశారు. వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి మరిన్ని వినూత్న సంస్కరణలు, అద్భుతమైన ఫలి తాలతో టిటిడిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో టిటిడిఅధికారులు, ఉద్యోగులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అభివాదం చేస్తున్న
రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకరు రఘురామ

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యం

## రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అంత కుముందు ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన స్పీకర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు వందేమాతరం గీతాలాపనతో కార్యక్ర మాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని స్పీకర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు విశిష్ట సేవలందించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో ప్రముఖుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, గన్నవరం శాసన సభ్యులు.ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు, శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్వర్ణ శ్రీకాకుళం' అందరి ధ్యేయం కావాలి

## సంక్షేమానికి స్వర్ణయుగం.. శ్రీకాకుళం అభివృద్ధికి మహా ప్రణాళిక

## రైతు సంక్షేమం.. సాగునీటికి పెద్దపీట..

## మౌలిక వసతులకు భారీగా నిధులు: మంత్రి అచ్చెన్నాయుడు



శనివారం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 15 ప్రభాతవార్త :** సుపరిపాలనతో రాష్ట్రంలో సంక్షేమానికి స్వర్ణయుగాన్ని తీసుకురావడంతో పాటు శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతు సంక్షేమం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2047 నాటికి స్వర్ణ ఆంధ్ర-స్వర్ణ శ్రీకాకుళం లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలల భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1.49 లక్షల కోట్లను సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి జిల్లాలో 3,04,352 మంది పింఛనుదారులకు ప్రతి నెలా రూ.129.99 కోట్లు అందిస్తున్నామని మంత్రి వివరించారు. తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో 2,54,456 మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.381.684 కోట్లు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. బడిబయట ఉన్న 8,654 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించామని వివరించారు. ఖరీఫ్ 2026లో ఇప్పటివరకు 1,35,059 హెక్టార్లలో పంటలు సాగయ్యాయని వివరించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద 2026లో తొలి విడతగా 2,79,100 మంది రైతులకు రూ.183.61 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. నారాయణపురం, మడ్డువలస జలాశయాల ద్వారా 44,160 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,230 ఎకరాలకు, కుడి ప్రధాన కాలువ ద్వారా 63,134 ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేరడి బ్యారేజీ నిర్మాణానికి రూ.641.10 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశామని చెప్పారు.పంచాయతీరాజ్ శాఖ ద్వారా రెండు సంవత్సరాల్లో రూ.240 కోట్లతో 551 కిలోమీటర్ల పొడవున 3,300 సీసీ రహదారులు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. మరో రూ.107 కోట్లతో 104 కిలోమీటర్ల మేర 39 బీటీ రహదారులు పూర్తయ్యాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

మత్స్యకార సేవలో పథకం కింద 2026-27లో వేట నిషేధ భృతిగా 16,738 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.32.38 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. 2047 నాటికి శ్రీకాకుళం జిల్లాను పేదరిక రహితంగా, స్వయం సమృద్ధిగా, సాంకేతికత ఆధారితంగా, పెట్టుబడులకు అనుకూలంగా, ఉపాధి అవకాశాలతో కళకళలాడే జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ పరిరక్షణే మా సంకల్పం

## శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తాం: టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



తిరుమలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో నప్రసంగిస్తున్న చైర్మన్ బి.ఆర్.నాయుడు

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ నలుమూలల నుండి తిరుమలకు విచ్చేసే శ్రీవారి భక్తుల సేవే టిటిడి ప్రధాన ధ్యేయమని, సనాతన ధర్మ పరిరక్షణే తమ సంకల్పమని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఉద్ఘాటించారు. శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ, విద్య, వైద్యం, ధార్మిక సేవలకు పెద్దపీట వేస్తూన్నామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఉదయం టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ మైదానంలో టిటిడి చైర్మన్ బిఆర్నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్‌తో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు చైర్మన్ ఉద్యోగులనుద్దేశించి వేంకటేశ్వరస్వామి దివ్య కైంకర్యాల్లో సేవలందిస్తున్న అర్చక స్వాములు, భక్తుల సేవలో తరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, ఉద్యోగులు, భద్రతా సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, మీడియా , దేశ విదేశాల నుండితిరుమలకు విచ్చేస్తున్న భక్తకోటికి భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనానంతరం దివ్యానుభూతితో తిరిగి వెళ్లేలా సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా టిటిడి బోర్డు, యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబరు 15 నుండి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అదేవిధంగా అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనం, వాహనసేవలను భక్తిశ్రద్ధలతో వీక్షించేలా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్షలాది మంది భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యమైన అన్నప్రసాదం అందించేందుకు దాతల సహకారంతో 120 కోట్లతో మరొక వంటశాలను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దాతల సహకారంతో 145 కోట్లతో అభివృద్ధి చేసిన తిరుమల ఎస్వీ మ్యూజియంలో శ్రీవారి సేవలు, ఉత్సవాలు, అరుదైన ఆభరణాల వైభవాన్ని 3డీ, 7డీ రూపంలో భక్తులకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు నాయుడు తెలిపారు. కోదండరామస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక వైభవానికి తగినట్లుగా తీర్చిదిద్దేందుకు కడపజిల్లా ఒంటిమిట్టలో విశ్రాంతి గృహాలు, యాత్రికుల సౌకర్యాలు, విద్యుత్ అలంకరణలు, భూసేకరణ తదితర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టి, ఒంటిమిట్టను మరింత ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో 19.62 ఎకరాలు, అస్సాంలోని గౌహతిలో 10.32 ఎకరాలు, తెలంగాణలోని ఖమ్మంలో 20 ఎకరాలు, కర్ణాటకలోని బెల్గాంలో 6.43 ఎకరాలు, ముంబైలోని బాంద్రా ప్రాంతంలో అదనంగా మరో 10 సెంట్లు, అదేవిధంగా బీహార్ రాష్ట్రంలో కూడా భూమిని సేకరించి శ్రీవారి ఆలయాల నిర్మాణ పనులను ముందుకు తీసుకెళుతున్నామన్నారు. గత రెండేళ్లుగా టిటిడిలోని వివిధ ట్రస్టులకు సుమారు 1,500 కోట్లకు పైగా విరాళాలు అందించిన ప్రతి దాతకు టిటిడి తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. 161.40 కోట్లతో టిటిడి విద్యాసంస్థలను ప్రపంచస్థాయి విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, సదాశివరావు, నరేష్‌కుమార్, అదనపు ఇఒవెంకయ్య చౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, పి. గోపినాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, అదనపు సివిఎస్ఒ శివకుమార్ రెడ్డి, , సిఇ మనోహారం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిఎఫ్ఒ డి. ఫణికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్ రైల్వేడివిజన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం

### పాల్గొన్న డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఎడిఆర్ఎం శివ ప్రసాద్





**గుంతకల్ రైల్వే, ఆగస్టు 15 ప్రభాత వార్త:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ గుంతకల్ డివిజన్ 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైల్వే గ్రౌండ్ నందు నిర్వహించిన వేడుకలలో గుంతకల్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా మరియు ఎడిఆర్ఎం శివప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మన దేశభక్తులు, అమరవీరులు మరియు స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించే పవిత్రమైన సందర్భమిది. అదే సమయంలో, ప్రస్తుత సంవత్సరంలో మనకు కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో మన వంతు కృషిని సమీక్షించుకుని, మరింత మెరుగైన పనితీరుకు కట్టుబడి ఉండాల్సిన సందర్భం కూడా ఇదే. దేశభక్తుల పోరాటాన్ని గుర్తుచేసే ఈ జాతీయ పండుగ, మన దేశం పట్ల గర్వంగా మరియు విధేయతతో ఉండేందుకు మనలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2025-26లో డివిజన్ 15.73 మిలియన్ టన్నుల ఒరిజినేటింగ్ సరుకు లోడింగ్ సాధించింది. ఇది గుంతకల్ డివిజన్ చరిత్రలోనే అత్యధిక సరుకు లోడింగ్ నిర్వహించింది. డివిజన్ ..2,426 కోట్ల అత్యధిక ఆదాయాన్ని సాధించిందన్నారు. జూలై 2026లో గుంతకల్ డివిజన్ 97.57 పంక్చువాలిటీతో దక్షిణ కోస్తా రైల్వేలో మొదటి స్థానాన్ని సాధించింది. జూలై 2026లో 3 సందర్భాల్లోఆగస్టు 2026లో 4 సందర్భాల్లో కోచింగ్ రైళ్లకు 100 పంక్చువాలిటీ సాధించి, భారతీయ రైల్వేల్లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. బెస్ట్ ఎలక్ట్రిక్ షెడ్ మైంటైనెడ్ బై డీజిల్ షెడ్ స్టాఫ్ " విభాగంలో 2వ అత్యుత్తమ పనితీరు కనబరిచిన షెడ్‌గా అవార్డు సాధించిందన్నారు. బెస్ట్ డీజిల్ షెడ్ హోమింగ్ ఎలక్ట్రికల్ లోకస్ "గా రైల్వే బోర్డు షీల్డ్‌ను అందుకుందన్నారు. గుంతకల్ డివిజన్ మీదుగా మొత్తం 15 జతల కొత్త రైళ్లు ప్రవేశపెట్టబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం /రామకృష్ణ, సౌత్ కోస్ట్ రైల్వే ఉమేన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మమతా గుప్తా, బ్రాంచ్ అధికారులు, సహోద్యోగి అధికారులు, ట్రేడ్ యూని యన్లు మరియు అసోసియేషన్ల ప్రతినిధులు, రైల్వే పరివార్ సభ్యులు, చిన్నారులు, ప్రజలు పాల్గొన్నారు.





# రెపరెప లాడిన 'తిరంగా జెండా'


## సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఎంఎల్ఏ

**శ్రీకాళహస్తి,ఆగస్టు 15 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం శనివారం ఆలయాలు, మసీదుల వద్ద మువ్వన్నెల జెండా రెప రెప లాడింది. అలాగే పుణ్యక్షేత్రంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌సారథ్యంలో సారథ్యంలో మోటార్‌సైకిల్ ర్యాలి కార్యకర్తలతో కలసి నిర్వహించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా మసీదుల వద్ద జమియతుల్ ఉలమ నాయకుడు ముఫ్తీనయిం సాహెబ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ మేరకు పట్టణంలోని 15 మసీదుల వద్ద జాతీయ జెండా రెప రెప లాడింది.వాయులింగేశ్వరుని పరిపాలనా భవనాల వద్ద ఇఓ బికె వెంకటేశులు ముఖ్యఅతిథిగా పాల్గొనగా జాతీయ జెండాను ఎగురవేసి వందన స్వీకారం చేసారు.ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి పూజలతో కార్యక్రమాల్ని ఏర్పాటు చేసారు. కాగా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరై పలు శాఖల్లో సేవలందించిన వారికి ప్రసంసా పత్రాలను అందించారు. అలాగే రెండేళ్ళలో శ్రీకాళహస్తి నియోజకవర్గం సాధించిన ప్రగతిని వివరించారు.ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడుకోలా ఆనంద్ కుమార్,శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,మార్కెటింగ్ కమిటి చచైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కెవి కృష్ణారెడ్డి సారథ్యంలో స్వాతంత్రదినోత్సవ వేడుకలను నిర్వహించారు.

# రూ.1,226కోట్లతో తిరుపతి వన్ ప్రాజెక్టు

## స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో మంత్రి ఆనం

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిజిల్లాను ఆలయాలు బీచ్, రిసార్ట్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.తిరుపతికి సమీపంలోని దామినేడు వద్ద 1,226 కోట్ల రూపాయలతో "తిరుపతి వన్ "ప్రాజెక్టుకు 21 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. అలిపిరి, వడమాలపేట మండలం ఎస్వీపురం ప్రాంతాల్లో 440 కోట్లతో ఫైవ్‌స్టార్ లగ్జరీ రిసార్ట్ ఏర్పాటుకు 33 ఎకరాల భూమిని కేటాయించామని చెప్పారు. ఏఐ ఆధారిత సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తిరుపతిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాలో చంద్రగిరి నియోజకవర్గం రాయలచెరువు వద్ద వాటర్ ఏరోడ్రోమ్, సీప్లేన్ సేవలకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా శనివారం ఉద యం తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌పల్లి ఏఆర్ పోలీస్‌మైదానంలో జరిగిన జాతీయజెండా వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. తిరుపతి జిల్లాలోని 36 మండలాల్లో 1,023 ఆలయాలు ఉండగా, క్యూ లైన్ నిర్వహణ, ఆర్‌టిజిఎస్, వాట్సాప్, "మనమిత్ర యాప్ ద్వారా పారదర్శక సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడి ఆలయాల విషయంలో రాష్ట్రంలోని 111 ఆలయాల్లో అన్నప్రసాదం, 65 ఆలయాల్లో నిత్యాన్నదానం నిర్వహిస్తూ ప్రతిరోజూ సుమారు 50 వేల మంది భక్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి సుమారు 158 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. 5 వేల భజన మందిరాల నిర్మాణానికి 750 కోట్లు, 1,670 మందిరాలకు 570 కోట్లు రూపాయలు మంజూరు చేశామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను, జిల్లా అధికారులకు అవార్డులను మంత్రి రామనారాయణరెడ్డి అందజేశారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 165 మంది సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల్లో




ప్రతిభ కనబరిచిన విజేతలకు, డాగ్ షో బృందానికి కూడా అవార్డులను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందజేశారు.
ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, చంద్రగిరి ఎం ఎల్ ఏ పులివర్తి నాని, తుడా చైర్మన్ సి. దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, డిఆర్ఒ నరసింహులు,తిరుపతి కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ శారదాదేవి, తిరుపతి ఆర్డిఒ రామ్మోహన్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనంకి అస్వస్థత

## వైద్యచికిత్సతో కోలుకున్న మంత్రి

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం జరిగిన 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నరాష్ట్రమంత్రి ఆనంరామనారాయణరెడ్డి ఉన్నఫళంగా అస్వస్థతకు గురయ్యారు. ఆయన ప్రసంగిస్తూ క్రిందకు తుళ్ళి పడబోయాడు. వెనుకనే ఉన్న భద్రతసిబ్బంది, జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఆయన్ను పట్టుకుని కూర్చోబెట్టారు. వెంటనే అత్యవసరంగా ఉన్న వైద్యసిబ్బంది మంత్రికి వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యం చేయడంతో కోలుకున్నారు. వెంటనే ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం బిపి లెవెల్స్ పడిపోయాయని వెల్లడించారు. కాసేపట్లో కోలుకున్న మంత్రి తిరిగి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మిగిలిన ప్రసం గాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్లు చదివి వినిపించారు.

# కృష్ణానదిలో మునిగి ముగ్గురు యువకుల మృతి

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త:** కృష్ణానదిలో తాడేపల్లి పరిధిలో ముగ్గురు కృష్ణలంకకు చెందిన యువకులు స్నానానికని వెళ్ళి మృతి చెందిన వైనంపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంక,ద్వారకానగర్,మొదటి లైనుకు చెందిన వీసం గౌతం ఇంటర్ పూర్తై సిఎ చదువుతున్నాడు. అక్కడే నివసిస్తున్న గెడ్డం జాషువా ఇంటర్ పూర్తి చేసి స్క్రాప్ కొట్లోకి పనిలోకి వెళ్తున్నాడు. వీరిద్దరూ బావా బామ్మర్దులు.ఒకే ఇంటిలో నివసిస్తుంటారు. పీగుళ్ళ తేజేష్ కూడ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇతని తండ్రి ప్రైవేటు డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరందరూ ద్వారకానగర్ లోనే నివసిస్తున్నారు. వీరు ముగ్గురుతో పాటు మరో ముగ్గురు శనివారం సాయంత్రం సుమారు 4 గంటలకు పార్కుకు వెళ్తున్నామని ఇంటిలో చెప్పి కృష్ణానదికి వెళ్ళారు.కృష్ణలంక మార్వాడీ గుడి వద్ద నుండి నడుచుకుంటూ వెళ్ళి విజయవాడ వైపు నీళ్ళు లేకపోవడంతో తాడేపల్లి పాయవైపుకు వెళ్ళినట్లు సమాచారం. గౌతం,తేజేష్, కృష్ణ,ప్రేమ్, జాషువా, తేజలు కలిసి వెళ్ళారు. కృష్ణానది పాయ లోకి నలుగురు దిగారు. మరో ఇద్దరు మాత్రం బయటే వేచి ఉన్నారు. వీరిలో తేజ నదిలో నుండి బయటకు వచ్చేశాడు. ముగ్గురు మాత్రం నదిలో మునిగిపోయారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేడు విజయవాడలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

## రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని ఆదివారం కూటమి ప్రభుత్వం ఘనంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలి పారు. రాష్ట్ర స్థాయి జయంతిని విజయవాడలో నిర్వహిం చనున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేష కృషి చేసిన మహనీయుడని కొని యాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు.

పశ్చిమాసియాలో అశాంతి దేశంలోని మధ్య, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న అందిరిపై ప్రభావం చూపుతోంది. గ్యాస్,పెట్రోల్ ధరలు పెరగడంతో ఉప్పుతోపాటు అన్నినిత్యవసరాల ధరలు పెరిగాయి. ఇరాన్‌పైఅమెరికా దాడి చేయడంతోనే ధరలు పెరుగుతూ ఉన్నాయి.గత సంవత్సరంకంటే 113శాతం అన్నింటి ధరలు పెరిగాయి. ఏం కొనేట్టులేని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో నిత్యవసరాలు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.తెలంగాణ ప్రభుత్వం నిత్యావసరాలు పంపిణీ చేయాల్సిన ఆవశ్యకత గుర్తించాలి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల15నుండి రాష్ట్రంలోని కోటి 5 లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించిన నేపథ్యంలోస్మార్ట్ రేషన్ కార్డులతోపాటు 14 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రికి లేఖరాసి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రజల తరుపున డిమాండ్ చేశారు.ప్రస్తుతం కార్డుపై ఒక వ్యక్తికి 6కిలోల బియ్యం మాత్రమే అందుతున్నాయి.పెరిగిన ధరలకు అనుగుణంగా పేదకుటుంబాల ఆదాయాలు పెరగకపోవడంతో, వారు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.తద్వారా రక్తహీనత, పిల్లల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డుదారులకు న్యూట్రీషియన్లతో సంప్రదించి, బియ్యంతో పాటు కందిపప్పు,శనగపప్పు,పెసరపప్పు,మంచినూనె,గోధుమలు/గోధుమ పిండి,కోడిగుడ్లు, మిల్లెట్స్,చక్కెర, చింతపండు,పసుపు, కారం పొడి, ఉప్పు, కొబ్బరినూనె వంటి నిత్యావసర సరుకులైన 14రకాల వస్తువులను రేషన్‌కార్డు ద్వారా పంపిణీ చేయాలి.దారిద్ర్యరేఖకు దిగువనఉన్నవారికికే కాకుండా దిగువ,ఎగువమధ్య తరగతి ప్రజలకు కూడా ఉప్పు, చింతపండు, జీలకర్ర,మెంతులు,కందిపప్పు,తదితర పల్లిలు వంటివి సరఫరా చేయాల్సిన అవసరంఉంది.

# స్మార్ట్‌గా సివిల్ సప్లయ్ ఆధునీకరణ

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

'అదిరిందయ్యా ఉత్తమ్! స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్లు, మిషన్ కె 100 ధాన్యం సేకరణ కార్యాచరణ. సిలోస్‌లు, సిఎంఆర్ ధాన్యం అక్రమార్కులపై మెరుపు దాడులు' అన్నట్లు పౌరసరఫరాలశాఖ ఆధునీకరణలతో ఓవైపు ఆహారభద్రతకు పెద్దపీట వేస్తూ మరోవైపు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించే రైసుమిల్లర్లపై మెరుపుదాడులు చేస్తూ తెలంగాణ ప్రజల ఆదరాభిమానం చూరగొంటున్నది. తెలంగాణలో ఆహార భద్రతకు శనివారం సంగారెడ్డిలో లాంఛనంగా స్మార్ట్ రూపం ఇచ్చింది.స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా 3.43కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. స్మార్ట్‌కార్డులపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం నిధులు సింహభాగంలో ఉంటాయనీ ఎవని అయ్య జాగీరు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకొన్నారని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ప్రశ్నించారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు తక్షణమే కార్డుల పంపిణీ నిలిపేయాలని అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్మార్ట్ కార్డుపై కేవలం ఇద్దరిఫోటోలు మాత్రమే ముద్రించడం ఇంటా బయట విమర్శలు వస్తున్నా రాష్ట్రంలోని 33జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం చేపట్టాలని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలమేరకు అన్ని జిల్లాలో మొదలైంది.రాష్ట్రంలో ప్రస్తుతం1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారు. వీరిందరికి రానున్న పది రోజుల్లో స్మార్ట్ రేషన్‌కార్డులు అందిస్తారు.కొత్త స్మార్ట్ రేషన్ కార్డులకు నకిలీలను రూపొందించకుండా నివారించేలాతొమ్మిది రకాల ఆధునిక భద్రతా ఫీచర్లతో తయారు చేశారు. బ్యాంకు నోట్లు, పాస్పోర్టులు వంటి అత్యంత భద్రత కలిగిన పత్రాల్లో ఉపయోగించే టెక్నాలజీని వినియోగించారు.పైన ఎడమవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలను ముద్రించారు. రేషన్ కార్డు నంబరు, కుటుంబ యజమాని పేరు, చౌకధరల దుకాణం సంఖ్యతో పాటు గ్రామం,మండలం, జిల్లా లబ్దిదారుని ఇంటి చిరునామా వివరాలున్నాయి. కుటుంబ యజమానిగా మహిళల పేర్లనే ముద్రించారు. సాంకేతికమైన పలు భద్రతా ఫీచర్లు జోడించడంతో ఈ కార్డును స్కాన్ చేయగానే లబ్దిదారుల వివరాలు నిర్ధారణ అవుతాయి. ఈకార్డు ఉన్న ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరుకిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల




ప్రవేశంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత రేషన్ కార్డుల జారీ చేసే విషయంలో ఆనాటి బిఆర్ఎస్ పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు అందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. దీనితో గత ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పాలకులు పాతవాటికి తోడు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి ఆ కుటుంబాలకు చెందిన 61,08,544 మంది లబ్దిదారులకు ఆహార భద్రత కల్పించారు. ప్రస్తుతంరాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1,06,28,092 కోట్లకు చేరడమే కాకుండా కాంగ్రెస్ పాలకులు చేసిన కృషి కారణంగా 3.43కోట్ల మందికి కడుపునిండా ఎన్నడులేని తిండితినే అవకాశం కల్పించారు.తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే ప్రబలనిదర్శనం. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేలకోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది.ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్దిదారుడి చెంతకు తీసుకెళ్లడానికి బియ్యం రవాణాలో పారదర్శకతకు స్మార్ట్ సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ అనే పద్ధతిని తీసుకొచ్చారు.మండల్ లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం రవాణాలో పూర్తి పారదర్శకత పాటించేందుకు పౌరసరఫరాల సంస్థలో స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ అనే నూతన విధానం ప్రవేశపెట్టారు.స్మార్ట్ ఎస్‌సిఎం విధానం అమలు చేయడానికి యాప్ ప్రత్యేకంగా రూపొందించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్2 కాంట్రాక్టర్ లారీల ద్వారా బియ్యం రవాణా చేసేవారు. ఆ లారీలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం అమర్చారు. ఆ లారీ ఎటువెళుతుంది, ఎక్కడ ఆగింది? ఈ విధానంలో తెలుస్తుంది. కానీ బియ్యం ఎక్కడ, ఎంత దిగుమతి అయ్యిందో తెలియదు. ఎఫ్‌సిఐ, ఎసిడబ్ల్యూసి గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేసే స్టేజ్1 విధానంలోనూ అమలు చేస్తే పారదర్శకత పెరుగుతుందని అధికారులు, డీలర్లు భావిస్తున్నారు.నూతన స్మార్ట్ ఎస్‌సి ఎం విధానంలో టెండర్ల సమయంలో అనుమతించిన నంబర్లతో ఉన్న లారీల వివరాలను కాంట్రాక్టర్ ఆన్లైన్లోనమోదు చేస్తారు. ప్రస్తుతం ల్యాప్టాప్, డెస్క్టాప్లో నూతన యాప్ అందుబాటులోకి వచ్చింది. త్వరలో మొబైల్స్ యాప్ అందుబాటులోకి తేనున్నారు. డీలర్, కాంట్రాక్టర్, ఎంఎల్ఎస్ పాయింట్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారుల మొబైల్స్‌లో ఈ యాప్ అందుబాటులోకి రానుంది. మరోవైపు రైస్‌మిల్లు అక్రమార్కులపై పకడ్బందిగా దాడులు చేస్తూ ధాన్యం స్టాక్ చూపని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.సివిల్ సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక వైపు విజిలెన్స్ డిజిపి డిఎస్‌చౌహాన్ రైసుమిల్లర్లను ఏ మాత్రం ఊపిరి తీసుకోకుండా ధాన్యం అప్పగించాలని ఒత్తిడి పెంచుతున్నారు. సివిల్‌సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర జిల్లాలో డిఎస్‌వో,డిఎం సివిల్ సప్లయ్‌కార్పొరేషన్‌లు పోలీసు స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లకు కేసులు వీగిపోకుండా ఎఫ్ఐఆర్ కేస్ షీట్ రాసేందుకు తర్ఫీదు ఇచ్చారు. గతంలో కోర్టు తీర్పుల అనుభవాలను తీసుకొని ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని తీసుకొచ్చి ఇక ముందు రైస్‌మిల్లు ఓనర్లకు ఏ తప్పించుకోని అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపట్టారు. దీనితో కోర్టుల్లో ముందస్తు బెయిల్ రాకుండా పోయింది. మరోవైపు కొంతమంది మిల్లర్లు ఇతర దేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిసి వారిపై లుకౌట్ నోటిసులు కూడా జారి చేయడానికి ఉపేక్షించకూడదని కింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు పరిస్థితికనుగుణంగా చర్యలు తీసుకొనే స్వేచ్ఛను ఇచ్చారు. దీనితో ప్రతి రోజు సిఎంఆర్ ధాన్యం అక్రమార్గం పట్టించిన మిల్లర్లు బిక్కుబిక్కుమంటూ ఎప్పుడు తాము ఊచలు లెక్కించాల్సి వస్తుందో అనే భయంతో నెట్టుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ ధాన్యంపక్కదారి పట్టించిన రైసు మిల్లులపై మిల్లుల్లో విజిలెన్స్, ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి తనిఖీలు చేయడం జులై 20నుంచి నిరంతరంగా కొనసాగిస్తూనే ఉంది. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 89రైస్‌మిల్లుల్లోనే3,72,693.23 టన్నుల ధాన్యం మాయం అయినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ఈ వడ్ల విలువ రూ.927.16 కోట్లు అయితే ఇందులో పదిరోజులుగా రూ. 715 ప్రభుత్వం రాబట్టింది మొత్తానికి ఈ సారి భారీగా రికవరీ చేయగలిగారు. బ్యాంకుల నుంచి వడ్డీకి రుణాలు తీసుకుని రైతులకు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు ఇస్తే..మరాడించి బియ్యం ఇవ్వకుండా అమ్మేసుకుంటున్నారు. పక్కదారి పట్టించిన వడ్లలో 2022-23 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్లకు సంబంధించినవే అత్యధికంగా ఉన్నాయి. మరోవైపు అజ్ఞాతంలోకి వెళ్ళిన కొంతమంది రైసుమిల్లర్లపై లుకౌట్ నోటిసులకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకే ఒక్కరోజు జులై మూడోవారం భారీ స్థాయిలో రైసుమిల్లులు ధాన్యం పక్కదారి పట్టించిన వరగంల్, మహబూబ్‌నగర్, జగిత్యాల, నల్లగొండ,సూర్యపేట మెదక్ రైసుమిల్లుపై దాడి చేసి రూ.154 కోట్ల ధాన్యం రైసు మిల్లులు పక్కదారిపట్టించినట్లు గుర్తించి కేసులుపెట్టారు. జులై చివరివారం రెండవ అతి పెద్ద ధాన్యం వ్యత్యాసం ఐదు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.106 కోట్ల అక్రమాల్నిగుర్తించారు. ●

# 'పరీక్షా' కాలం!

ఝార్ఖండ్

ఎ.వి.వి ప్రసాద్

పరీక్షలే ఇప్పుడు ప్రభుత్వాలకు పరీక్షగా మారుతున్నాయి. ఢిల్లీ జంతర్ మంతర్‌వద్ద రగిలినఆందోళనల జ్వాలలు ఇప్పుడు రాంచీ మీదుగా వివిధ రాష్ట్రాలకువిస్తరిస్తూ అందరిలో ఆందోళన పెంచుతున్నాయి. విద్యార్థులు,ఉద్యోగార్థులు చేయిచేయి కలిపి తమకు న్యాయం కలిగించని ప్రభుత్వాలపై తిరగబడడం రాజకీయ నాయకులలో దడపుట్టిస్తోంది. జంతర్ మంతర్ ఆందోళనల ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఒక కీలక పరిణామమైతే, జార్ఖండ్‌లో సోరెన్ నాయకత్వంలోని జెఎంఎం ప్రభుత్వం ప్రస్తుతం గడ్డుపరిస్థితిని ఎదుర్కోవడం మరో కీలక పరిణామం. మూడు వారాలుగా విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచీలో సాగిస్తున్న ఆందోళనల జ్వాలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సీ)జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెపిఎస్‌సి) నిర్వహించిన నియామక పరీక్షల్లోని అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. జెఎస్ఎస్‌సి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సిజిఎల్) పరీక్షను రద్దు చేయాలని, నియామకాల్లోని అవకతవకలపై సిబిఐదర్యాప్తు జరపాలనీ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థినేతలు, ప్రభుత్వం మధ్య ఇప్పటికి మూడు దఫాలుగా చర్చలు జరిగినా సమస్యకు పరిష్కారం లభించకపోవడం చూస్తే ప్రభుత్వం ఎంత మొండివైఖరితో ఉన్నదో స్పష్టమవుతుంది. 14వ జెపిఎస్‌సి నియామక పరీక్ష రద్దు చేస్తామనీ, నిర్వహించిన టిడిపిఎల్ సంస్థపై ఇడి విచారణకు ఆదేశిస్తామనీ ప్రభుత్వం హామీ ఇచ్చినా సిబిఐ విచారణ జరిపించే వరకు తాము వెనక్కి తగ్గబోమని ఉద్యమ నాయకులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో జెపిఎస్‌సికి చెందిన ముగ్గురు సభ్యులు డా.అజిత్ భట్టాచార్య, డా. అనిమా హన్స్ దా, డా.జమీల్ అహ్మద్ ఇప్పటికే రాజీనామాచేశారు. సిజిఎల్ పరీక్షను సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకే నిర్వహించామనీ, అది న్యాయ పరిధిలో ఉన్నందున రద్దు కుదరదనీ మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకటించిన తర్వాత ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. సిజిఎల్ పరీక్ష ఫలితాలు కూడా వచ్చేశాయి. రెండు వేల మంది పైగా అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడంకూడా పూర్తయింది. అటువంటప్పుడు పరీక్ష రద్దు కోరడమేమిటని ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. పార్లమెంటును నీట్ ఆందోళనలు ఓ కుదుపు కుదిపితేనియామక పరీక్షలు జార్ఖండ్ అసెంబ్లీని తలకిందులు చేస్తున్నాయి. గత సోమవారం విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా మారి రక్తపాతాన్ని సృష్టించడంతో దానిప్రభావం అసెంబ్లీపై ఎక్కువగా పడింది.


విద్యార్థుల ఆందోళన

బుధవారం దాకా కొనసాగవలసిన అసెంబ్లీమంగళవారమే నిరవధికంగా వాయిదా పడింది. విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జిని నిరసిస్తూ విపక్ష ఎమ్మెల్యేలు గళమెత్తడంతో అసెంబ్లీ ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలను డబ్బుకు అమ్ముకుంటున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కరెన్సీని వెదజల్లడం నిరసనలకు పరాకాష్ట అనాలి. పరీక్షల సంస్కరణలకు సంబంధించి 855 సలహాలు వచ్చాయనీ, జవాబుదారీవ్యవస్థను మెరుగుపరుస్తామనీ సిఎం సోరెన్ అసెంబ్లీలో ప్రకటించినా ఎమ్మెల్యేలు వెనక్కితగ్గకపోవడంతో స్పీకర్ విధిలేక సభను నిరవధికంగా వాయిదా వేయవలసి వచ్చింది. పరీక్షల అవకతవకలపైనిరాహారదీక్ష చేస్తున్న ఆరుగురిలోరాహుల్ క్రాంతి ఆసుపత్రి ఐసియు నుంచే దీక్ష కొనసాగించడం ఉద్రిక్తతను మరింత పెంచుతోంది. జంతర్ మంతర్ ఆందోళనల్లో సోనమ్ వాంగ్చుక్ లా రాంచీ ఆందోళనల్లో దీపేంద్ర నాథ్ మహతో నిరవధిక నిరహార దీక్ష కొనసాగిస్తున్నారు. జార్ఖండ్ లోక్ తాంత్రిక్ క్రాంతికార్ మోర్చా (జెఎల్‌కెఎం) నేత అయిన మహతో చేస్తున్న దీక్ష జెఎంఎం ప్రభుత్వ పునాదులను కదుల్చుతున్నట్లే కనిపిస్తోంది. జెపిఎస్ సి మాజీ చైర్మన్ ఎల్.ఖియంగ్తేను సిఐడి పోలీసులు గత సోమవారం అరెస్టు చేసిన తర్వాత ప్రభుత్వం ఆందోళనకారులతో మరో దఫాచర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పినట్లే కనిపిస్తోంది.నిషేధిత సంస్థ టిఎస్సార్ డేటా ప్రాసెసింగ్‌కు పరీక్ష నిర్వహణ కాంట్రాక్టు అప్పగించడాన్ని కూడా విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఖియంగ్తే 2 కోట్ల రూపాయల లంచంతో పాటు 20శాతం కమిషన్ కూడా తీసుకొన్నట్లు ఆరోపణలున్నాయి. అటువంటి వారు మరికొందరుకూడా ఉన్నారు. దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం లభించకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది.కేవలం కంటితుడుపు చర్యగా కొందరు ముఖ్యులతో రాజీనామాలు చేయించినట్లుకనిపిస్తోంది.గత సోమవారం రాంచిలో ఆందోళనకారులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి చివరికి హింసాత్మకం అయింది. ఒక దశలో పోలీసులు లాఠీ చార్జిని కూడా జరిపి, బాష్పవాయువును ప్రయోగించారు. కొన్ని డజన్ల మంది తీవ్రంగా గాయపడ్డారు కూడా. ఈఘటన దేశవ్యాప్తంగా తీవ్రసంచలనం కలిగించింది. ఇషాంత్ సింగ్ యుద్ధంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆందోళనకారులు భారీగా నిర్వహించిన 'తిరంగా యాత్ర' నిరసన ర్యాలీ కూడా దేశంలో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్న సిబిఐ దర్యాప్తునకు ప్రభుత్వం ఇంకా అంగీకరించకపోవడంతో పరిస్థితి పూర్తిగా చేయిదాటుతోంది.ప్రభుత్వం,విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ ఆందోళనలకు ఒక సరైన ముగింపుఇవ్వకపోతే ప్రజలు తీవ్రసమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆందోళనకారులు సమస్యను మరింత సాగదీయకుండా ఒక సామరస్య పరిష్కారానికి ప్రయత్నించాలి.పరీక్షల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఒక పటిష్టమైన, పారదర్శకమైన అధికారయంత్రాగాన్ని ప్రభుత్వం రూపొందించవలసి ఉంది. లేకుంటే ప్రభుత్వానికి నిత్యం పరీక్షే ఎదురవుతూంటుంది. ●

# ఆత్మహత్యల 'సెగ'లు!

ఫ్రాన్స్

గన్ని మోహన్

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సర్కారుకు రాజకీయ సంక్షోభంతోపాటు ప్రధాని కార్యాలయం ఉద్యోగుల ఆత్మహత్య ఘటనలు సతమతం చేస్తున్నాయి. రెండేళ్లలోనే నలుగురు ప్రధానులు మారిన మాక్రాన్ సర్కారులో ఉన్నత ఉద్యోగులు, కొత్త కేబినెట్ రాక వంటివాటితో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెరిగిందన్న భావన ఎక్కువైంది. మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను కార్యాలయానికి అనుబంధంగా పనిచేసే వివిధ ప్రభుత్వ విభాగాల్లో వరుసగా ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఉద్యోగులపై మానసిక వేధింపుల ఆరోపణలపై ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభించారు. ఈవ్యవహారంలో పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును చేపట్టింది.ఇప్పటివరకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. మరో ఉద్యోగి మృతి కూడా అనుమానాస్పద పరిస్థితుల్లో జరిగింది. రాజకీయ దుమారాన్ని అరికట్టేందుకు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు సంబంధించిన ఉద్యోగుల్లో ఎవరూ ప్రస్తుత ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను వ్యక్తిగత కార్యాలయంలో పనిచేయలేదని, వారెవరూ ప్రధానమంత్రితో నేరుగా పని చేసిన సిబ్బంది కాదని చెపుతున్నా ఆత్మహత్యల పరంపర విస్తృత దర్యాప్తునకు బాటలు వేసింది. దీనికి గత ఏప్రిల్‌లో జరిగిన ఓప్రభుత్వ ఉద్యోగి లారా అనే సీనియర్ ప్రభుత్వ ఉద్యోగిని ఏప్రిల్‌లో రైలు ముందు దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మూలం అయింది. ఓవ్యక్తి ఆమెను రక్షించడంతో ప్రాణాలతోబయటపడ్డారు. ఆతర్వాత లారా తన కార్యాలయంలో తనపై మానసిక వేధింపులు, అవమానకర ప్రవర్తన, తన ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు సృష్టించారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయ సేవలకు అనుబంధంగా ఉన్న కరస్పాండెన్స్ విభాగంలో పనిచేసిన తనను ఉద్దేశపూర్వకంగా ఒంటరి చేశారని ఆమెఆరోపించారు. ఆమెను సమావేశాలకు పిలవకుండా చేయడం, సంస్థాగత చార్టుల నుంచి ఆమె పేరును తొలగించడం, సహచరుల నుంచి దూరంగా ఉంచడం, అవమానించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు గురిచేశారని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కొన్ని నెలలముందే లారా తన వీలునామా,అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకున్నట్లు ఫ్రెంచ్ మీడియాలో విస్తృత వచ్చాయి. లారా ఘటన ఒక్కటే కాదని ప్రధాన మంత్రి కార్యాలయ సేవల పరిధిలోనిప్రభుత్వ విభాగాల్లో గత కొంతకా లంగా ఇలాంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గత అక్టోబర్‌లో ఓప్రభుత్వఉద్యోగి కార్యాలయంలోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. మార్చిలో ఓప్రాజెక్ట్ మేనేజర్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. మరో ప్రభుత్వ ఉద్యోగి కార్యాలయ తీవ్ర ఒత్తిడితో రైలు ముందు దూకిమరణించినట్లు ఆరోపణలున్నాయి.



సెబాస్టియన్ లెకోర్ను


లారా ఆత్మహత్యాయత్నం అనంతరం పారిస్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో ఓ యువ ఉద్యోగి మృతదేహం కూడా లభించింది. ఈవరుస ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల పని వాతావరణం, మానసిక ఆరోగ్యం, ఉన్నతాధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలుతలెత్తాయి. ప్రభుత్వంలోనే వ్యవస్థాగత స్థాయిలో ఉద్యోగులపై వేధింపులు జరు గుతున్నాయంటూ ఓ సిబ్బంది ప్రతినిధి జూన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించింది.ఉద్యోగులపై వ్యక్తిగతంగా వేధింపులు జరిగాయా? ప్రభుత్వ విభాగాల్లోని విధానాలు, తరచూ జరుగుతున్న మార్పులు, అధికారులశైలి కారణంగా వ్యవస్థాగత ఒత్తిడిఏర్ప డిందా అనే అంశాలను దర్యాప్తులోకి చేర్చారు. ఫ్రాన్స్‌లో గత రెండేళ్లుగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరత కూడా ప్రభుత్వ ఉద్యోగులపై పనిఒత్తిడిని పెంచిందని ఉద్యోగ సంఘాలు,సిబ్బంది ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత దేశరాజకీయాల్లో అనిశ్చితి పెరిగింది. రెండేళ్లలో ఫ్రాన్స్‌కు నలుగురు వేర్వేరు ప్రధానమంత్రులు రావడంప్రభుత్వ యంత్రాంగంలో తరచూ నాయకత్వ మార్పులకు దారితీసింది. ప్రధానమంత్రి మార్పులతోపాటు ఉన్నత స్థాయి అధికారుల బదిలీలు, మేనేజ్‌మెంట్ పునర్వ్యవస్థీకరణలు, విభాగాలపునర్నిర్మాణం తరచూ జరగడంతో ఉద్యోగుల్లో అయోమయం, అస్థిరత, ఒత్తిడి పెరిగిందని ఫ్రెంచ్ మీడియాతో పలువురు సిబ్బంది తెలిపారు. ప్రాసిక్యూటర్ కార్యాలయం చేపట్టిన క్రిమినల్ దర్యాప్తుతోపాటు ఫ్రెంచ్ ప్రభుత్వంకూడా ఈఘటనలపై అంతర్గత విచారణలకు ఆదేశించింది. వ్యక్తిగతంగా జరిగిన విషాద ఘటనలను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితులపై కూడా సమగ్రసమీక్ష చేపట్టింది. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం,కార్యాలయ వాతావరణం, నిర్వహణ విధానాలు, ఉద్యోగులపై ఒత్తిడివంటి అంశాలపై దర్యాప్తు చేసారు.ప్రధాని కార్యాలయంలోని అన్ని విభాగాల్లో పని పరిస్థితులపై ప్రత్యేక నిపుణుల ఆడిట్ నిర్వహణకు ఆదేశించడంతో పీఎంవో సేవల పరిధిలోని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి, వేధింపులు ఉన్నాయన్న ఆరోపణలపై ఇప్పుడు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభం కావడం ఫ్రాన్స్ ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగుల పని పరిస్థితులపై తీవ్రచర్చకు దారితీసింది. వరుస ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాల వెనుక వ్యక్తిగత కారణాలే ఉన్నాయా? లేక కార్యాలయాల్లోని వేధింపులు,పరిపాలనా అస్థిరత, అధికపని ఒత్తిడి కూడా కారణమా?అనే అంశాలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు స్పష్టత వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, సురక్షితమైన పనివాతావరణం కల్పించాల్సిన బాధ్యతను ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఈ ఘటనలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. ●

# కొత్త ఆధ్యాత్మిక చైతన్యమే 'ఇస్కాన్'

డి.శ్రీనివాస్

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్ నెస్...ఈ పేరు నేడు ఒక ఆధ్యాత్మిక విప్లవానికి పర్యాయపదం. కృష్ణ చైతన్యానికి మారు పేరు. హరినామ సంకీర్తన ధ్యేయంగా, శ్రీమద్ భగవద్గీత పునాదిగా, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య మహాప్రభు బోధనలు ఆలంబనగా విరాజిల్లుతోంది. హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే.. హరే రామ హరే రామ రామ రామ హరే హరే.. అనే మహామంత్రం భక్తులు నిత్యం వందలు, వేలసార్లు జపిస్తూ ధార్మిక జగత్తులో ఓలలాడుతున్నారు. భౌతిక సుఖాలకు పాకులాడకుండా శాశ్వతమైన గోలోకా బృందావనాన్ని చేరుకోవాలని తపిస్తుంటారు. ఏ.సి. భక్తివేదాంత స్వామి ఈ సంస్థ వ్యవస్థాపక ఆచార్యులు. తదనంతరం వీరే శ్రీల ప్రభుపాదులుగా వ్యవహరింపబడినారు. ఇస్కాన్‌ను భక్తి వేదాంత స్వామి 1966 జులై 13 న న్యూయర్క్‌లో ఏర్పాటు చేశారు. అలా ఈ సంస్థ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇటీవలనే ఉత్సవాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. ఇస్కాన్ స్థాపించాక వారు ప్రపంచవ్యాప్తంగా 108 కృష్ణ మందిరాలను నెలకొల్పారు. అందులో భాగంగా మనదేశంలో వారు తన స్వహస్తాలతో మాయాపూర్, కొలకత్తా, బృందావనం, హైదరాబాద్‌లో ఇస్కాన్ మందిరాలను ప్రతిష్టించారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరాన్ని 1976 ఆగస్టు 18న ప్రతిష్టించారు. అంటే ఈనెల 18తో ఈ మందిరం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. ఒకవైపు ఇస్కాన్ ఏర్పడి 60 సంవత్సరాలు, ఇస్కాన్ హైదరాబాద్ అబిడ్స్ మందిరం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా వీటి వివరాలు ఒకసారి పరిశీలిద్దాం. భక్తివేదాంత స్వామి కలకత్తాలో 1896 సెప్టెంబర్ 1న సాంప్రదాయ గౌడియ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు అభయ్. సంప్రదాయంగా వచ్చిన భక్తితో పాటు వారి తండ్రి మోహన్ దే కున్న అపారమైన భక్తి వీరికి కూడా బాల్యం నుండే అబ్బింది. అదే తదనంతర కాలంలో తన ఆధ్యాత్మిక ప్రయాణానికి బాటలు వేసింది. అందులో భాగంగా వేదాంత స్వామి 1922లో శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ ఆంగ్ల భాష తెలిసిన మీరు పాశ్చాత్య దేశాలలో కృష్ణ చైతన్యం ప్రచారం చేయాలని అభిలషించారు. అలాగే 1932లో సరస్వతి ఠాకూర్ మరోమారు వేదాంత స్వామికి 'నీవద్ద డబ్బులు ఉంటే కృష్ణ చైతన్యం పుస్తకాలు' ప్రచురించాలని, రచనలు చేయాలని సూచించారు.1935లో వారి వద్దనే వేదాంతస్వామి దీక్ష తీసుకున్నారు. 1944లో కలకత్తా నుండి 'బ్యాక్ టు హెడ్' పత్రికను ప్రారంభించారు. అనేక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ పత్రికను ప్రచురించారు. కృష్ణ చైతన్యం కొరకు కృషిచేశారు. పత్రిక ప్రచురణ, కృష్ణ చైతన్యం లక్ష్యంగా ఢిల్లీ తరచుగా వెళ్లేవారు. ఎందరినో కలిసి సహకరించాలని అభ్యర్థించేవారు.అయినా చేయూత లభించలేదు. కృష్ణ ప్రచారం పోరాటంలో బృందావనానికి తన మకాన్ని మార్చారు. అంతేకాకుండా 1959లో సన్యాసం స్వీకరించారు. గురువు ఆజ్ఞ మేరకు పుస్తకం ప్రచురణ, అనువాదం చేయటం ప్రారంభించారు. ఆశించిన రీతిలో ఆధ్యాత్మిక ప్రయాణం సాగటం లేదని గుర్తించి అమెరికా వెళ్లాలన్న చెక్కుచెదరని సంకల్పంతో ముందుకు సాగారు. ప్రచారం చేయాలని తలిచారు. చేతిలో డబ్బులు లేవు. వెళ్ళాక ఎక్కడ ఉండాలో తెలియదు. అయినా సంకల్పం చెక్కుచెదరలేదు. ఎట్టకేలకు సింధియా స్టీమ్ షిప్ లైన్ సంస్థ అధినేత్రి సుమతి మురార్జీని వేదాంతస్వామి 1965 ఆగస్టు 13న కలకత్తా షిప్ హార్బర్ నుండి జలదూత అనే షిప్‌లో ప్రయాణమైనారు. 37 రోజుల ప్రయాణం తర్వాత సెప్టెంబర్ 19న న్యూయార్క్ చేరుకున్నారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ నగరంలో ఉన్న గోపాల్ ఆగర్వాల్‌ఇంటికి వెళ్లారు. అనంతరం అనేక ప్రదేశాలలో తిరుగుతూ కృష్ణ చైతన్యం బోధనలు ఇవ్వసాగారు. అయితే ఆ రోజులలో అమెరికాలోని చాలా ప్రాంతాలలో యువత హిప్పి కల్చర్


శ్రీశ్రీ రాధా మదన మోహన


శ్రీల ప్రభుపాదులవారు

కలిగి, మత్తు మందులు, మాదక ద్రవ్యాలు,తాగుడుకు బానిసలై ఉండటాన్ని గమనించిన వేదాంతస్వామి ఆశ్చర్యకరంగా వారి మధ్యనే నివసించాల్సిన పరిస్థితులు నెలకొని ఉండేవి. అమెరికాలో 9 నెలలకు పైగా నిర్విరామంగా కృష్ణబోధనలు చేస్తూ, భారతీయ ఆధ్యాత్మికం, కృష్ణచైతన్యం పట్లవిశ్వాసం ఉన్న వ్యక్తుల తోడ్పాటుతో వేదాంతస్వామి తనకంటూ ఒక ఆశ్రయం ఏర్పాటు చేసుకున్నారు. న్యూయార్క్‌లోని సెకండ్ అవెన్యూ స్టోర్ ఫ్రంట్‌లో కృష్ణ సందేశాలు ఇవ్వడానికిహాల్, తాను నివాసం ఉండేందుకు ఒక గది కల భవనంలోకి తన మకాంని మార్చారు. అక్కడి నుండే కృష్ణ చైతన్య ప్రచారం కార్యక్రమాలు, భజనలు, హరినామ సంకీర్తనలు, శ్రీమద్ భగవద్ గీత, భాగవతం, కృష్ణ సంబంధ గ్రంథాలపై ప్రవచనాలు భక్తివేదాంత స్వామి ఇచ్చారు. ఈ కృష్ణ చైతన్య యాత్రలో చిరస్థాయిగా నిలిచేందుకు వారు 1966 జులై 13న 'ఇస్కాన్' ను స్థాపించారు. పూర్తి స్థాయి సంస్థగా రూపాకల్పన చేశారు. పుస్తక రచనలు, అనువాదాలు, ప్రచురణల కొరకు 'భక్తి వేదాంత బుక్ ట్రస్ట్' ను నెలకొల్పారు. శ్రీ అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి తదనంతరం శ్రీల ప్రభుపాదులుగా ప్రసిద్ధి చెందారు.ఎంతో మందికి దీక్షలు ఇచ్చారు.70కి పైగా వైదిక గ్రంథాలు, కృష్ణచైతన్య పుస్తకాలకి సంబంధించి సంపుటాలు రచించారు, అనువదించారు, అలాగే వాటికి వ్యాఖ్యనాలు రాసారు.వీరి గ్రంథాలు 95 భాషలలోకి అనువాదం అయ్యాయి. భగవద్గీత యథాతథం, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య చరితామృతం, భక్తి రసామృతం, శ్రీ ఈషోపనిషత్తు,ఉపదేశామృతం, దేవాదిదేవుడు శ్రీకృష్ణ భగవానుడు వంటిఅనేక సుప్రసిద్ధమైనగ్రంథాలు ఇవి కొన్ని. ఇక శ్రీల ప్రభుపాదులవారు కేవలం 11సంవత్సరాల వ్యవధిలో 14 సార్లు ప్రపంచాన్ని చుట్టివచ్చారు.తన జీవిత కాలం అంతా కృష్ణసేవలో, ఆచార్యుల మార్గనిర్దేశంలో గడిపిన శ్రీల ప్రభుపాదులవారు 1977 నవంబర్ 14న తనువు చాలించారు. నేడు అనేక దేశాలలో ఇస్కాన్ కృష్ణ మందిరాలున్నాయి. కోట్లల్లో ఇస్కాన్ భక్తులున్నారు. వివిధ సేవ కార్యక్రమాలు, ఉచిత భోజన వితరణ, విద్యా సంస్థలు, గోశాలలు, గురుకులాలు, వర్ణాశ్రమాలు, సమాజ హితం కోసం పనులు చేస్తూ, మరోవైపు భక్తి యుత సేవ చేస్తూ ఇస్కాన్ నేడు ఆధ్యాత్మిక భూలోక బృదావనంగా తీర్చిదిద్దబడింది. ముఖ్యంగా జగన్నాథ రథయాత్రలు అన్ని చోట్లా నిర్వహిస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాలలో ఇస్కాన్ కృష్ణ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 900కు పైగా ఇస్కాన్ రాధాకృష్ణ మందిరాలు నెలకొల్పబడినాయి. 75కోట్ల భక్తి గ్రంథాలు ప్రపంచ దేశాలలో అనేక భాషలలో వితరణ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 1.2కోట్ల మంది భక్తులు ఇస్కాన్ ఆలయాలను సందర్శిస్తున్నారు. భారతదేశంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం ద్వారా ప్రతి రోజూ సుమారు 30లక్షల మంది పిల్లలకు భోజనం అందించబడుతోంది. వైద్యసేవల్లో భాగంగా ఇస్కాన్ ఆసుపత్రులు, వైద్య శిబిరాలు, నేత్ర శిబిరాల ద్వారా ఇప్పటివరకు సుమారు 3.4 లక్షల మంది రోగులు సేవలను పొందారు. 1967నుంచి ఇప్పటివరకు సుమారు ఒక లక్షమంది భక్తులు అధికారిక ఆధ్యాత్మిక దీక్షను స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 6వేల కృష్ణ చైతన్య ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరం ఈనెల 18వ తేదీతో 50సంవత్సరాలు పూర్తిచేసుకుని, స్వర్ణోత్సవ శోభను సంతరించుకుంది. శ్రీల ప్రభుపాదులు 1976 ఆగస్టు 18న ఈ మందిరంలో శ్రీ శ్రీ రాధా మదన మోహన, శ్రీ శ్రీ గౌరనితాయి, శ్రీశ్రీజగన్నాథ, సుభద్ర, బలదేవ విగ్రహాలను ప్రతిష్టించారు. 50 ఏళ్ళ ప్రస్థానాన్ని అత్యంత వైభవంగా ఆలయకమిటీ నిర్వహిస్తోం ది. ఈ సందర్భంగా ఆగస్టు 15, 16, 17, 18 తేదీలలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 5లక్షల భోజనాలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరిస్తారు. 50ఏళ్ల ప్రస్థానంలో సేవలందించిన వారికి సత్కారం చేయాలని నిర్ణయించారు. భక్తితత్వంతో నిస్వార్థ సేవ.. అమెరికాలో అననుకూల పరిస్థితులను సైతం సానుకూలంగా మార్చుకుని యువతను 'కృష్ణ చైతన్యం'లోకి తెచ్చారు. జీవితాన్ని తరతరాలకు ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. ●

# ప్రధాని చెప్పిన 'సప్తధార'లు ఇవీ..

## ఏడు లక్ష్యాలతో దేశ అభివృద్ధికి వడివడిగా అడుగులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామన్న ప్రధానిమోడీ భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తివంతం చేస్తామన్నారు. యువతలో ఉన్న అపార సామర్థ్యాలను దేశ నిర్మాణం కోసం పూర్తిగా వినియోగిస్తామన్నారు. యువత ప్రతిభ, ఉత్సాహం, శక్తిని ఏకం చేసి బలమైన, మరింత అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించే దిశగా మళ్లిస్తామని మోడీ ప్రకటించారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు ధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. దేశ ప్రగతికి తయారీ రంగాన్ని భారత భవిష్యత్తుకు గ్రోత్ ఇంజిన్‌గా అభివర్ణించిన ప్రధాని మోడీ తయారీ రంగానికి ఊతమివ్వాలని పిలుపునిచ్చారు. మనకు విడి భాగాలతోపాటు పూర్తి స్థాయి ఉత్పత్తులు కూడా కావాలన్న ప్రధాని ప్రపంచ సప్లయ్ చైన్‌లో భారత్ కేంద్ర బిందువుగా మారాలని పిలుపునిచ్చారు. సప్తధారలో రెండో ధారగా వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాన్ని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ దిశలో మనం ముందుకెళ్లాలన్న ప్రధాని ఇప్పుడు ప్రపంచ మార్కెట్లు మన రైతులకు తెరిచి ఉన్నాయన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల అతిపెద్ద మార్కెట్లు సైతం మనకు అందుబాటులోకి వస్తున్నాయని మనం వాటిని చేరుకోవాలన్నారు. పొలం నుంచి ఎగుమతి మార్కెట్‌కు మన ఉత్పత్తులను మళ్లించాలన్నారు. మన సంప్రదాయ ఆహారం, మిల్లెట్స్, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలు అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. మూడో సప్తధారగా టెక్నాలజీ, ఆవిష్కరణలు అని పేర్కొన్న మోడీ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త టెక్నాలజీల యుగం నడుస్తోందన్నారు. ఈ టెక్నాలజీల హబ్‌గా భారత్ మారాలని పిలుపునిచ్చారు. యుపిఐని ప్రవేశపెట్టడం ద్వారా మన సామర్థ్యం ఏంటో మనకు తెలిసిందన్నారు. మేడిన్ ఇండియా 6జీ దేశమంతటా చేరాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. యుపిఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాతోపాటు నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో మనం మరో పెద్ద అడుగు వేయాలన్నారు. దేశవ్యాప్తంగా వేగవంతమైన కనెక్టివిటీని పెంపొందించాలన్న ప్రధాని వ్యాపార రంగానికి ఊతం ఇవ్వడం కోసం కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సప్తధారల్లో రక్షణ కూడా భాగమన్న ప్రధాని రక్షణ ఉత్పత్తుల తయారీ, రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ భారత్ మరింత పెట్టుబడులు పెడుతుందన్నారు. గ్రీన్ ఎనర్జీని ఆరో ధారగా పేర్కొన్న ప్రధాని దేశంలో కాలుష్యం తగ్గించడం కోసం గ్రీన్ టెక్నాలజీ రంగంలో పెద్ద ఆవిష్కరణలకు పిలుపు నిచ్చారు. భారత సాఫ్ట్ పవర్‌ను ఏడో ధారగా ప్రకటించిన ప్రధాని యోగా, చేతివృత్తులు, సినిమా, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, సృజనాత్మక రంగాన్ని సాఫ్ట్ పవర్‌కు ఉదాహరణగా పేర్కొన్నారు. పెద్ద స్థాయిలో అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం భారత్‌కు ఉందన్న ప్రధాని దేశంలో అనేక జాతీయ పార్కులు, మ్యూజిక్ కన్సర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ఇతర ఆకర్షణీయ ప్రదేశాలు ఉన్నాయన్నారు.

## దిమాగీ నక్సల్స్‌తో జాగ్రత్త...

### యువతకు ప్రధాని మోడీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీజాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దిమాగీ నక్సల్స్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో ఆయుధాలు పట్టిన నక్సలిజాన్ని విజయవంతంగా నిర్మూలించామని, సాయుధ నక్సల్స్ కనుమరుగైనా దిమాగీ నక్సల్స్ మిగిలి ఉన్నారని ప్రధాని అన్నారు. దిమాగీ నక్సల్స్ ఒక అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ప్రధాని మోడీ తెలిపారు. మనం వారిని గుర్తించి ఏకాకిని చేయాలని మోడీ సూచించారు.

3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది నక్సలిజం పోరాటంలో అమరులయ్యారని, ఇది యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికంటే ఎక్కువని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోడీ పిలుపునిచ్చారు. నేను అందరినీ ఒక సాయం చేయాలని అడుగుతున్నాను. జనగణన విషయంలో ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో మీరు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి.

దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోడీ పేర్కొన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువతకు తీపి కబురు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. గడిచిన కొన్నేళ్లలో దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారత్‌లోకి వస్తున్నాయని, మన యువత స్వదేశంలోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభించిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.



## యుద్ధ నౌకలతో హార్ముజ్‌ను స్వాధీనం చేసుకోలేరు

### ట్రంప్‌కు ఇరాన్ కౌంటర్

**టెహ్రాన్, ఆగస్టు 15:** హార్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని.. దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని పేర్కొంది. హార్ముజ్‌ను మూసి ఉంచాలా? తెరవాలా? అనేది తమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ తెలిపారు. యుద్ధ నౌకల మోహరింపు ద్వారా జలసంధిని స్వాధీనం చేసుకోలేరని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అగ్రరాజ్యం తన భ్రమలను విడిచిపెట్టి.. ఓటమిని అంగీకరించే వరకు హార్ముజ్‌పై ఇరాన్ దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. తాము బెదరింపులకు భయపడబోమని.. సైనిక ప్రదర్శనలకు లొంగబోమని స్పష్టం చేశారు. హార్ముజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటల్లో నిజంలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే.. జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టం చేశారు. హార్ముజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు.

**డొనాల్డ్ ట్రంప్ ఏమన్నారంటే..?**

యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని.. ఆ దేశం ఓటమిని చవిచూసినతర్వాత హార్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంవద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని.. దానిని నాశనం చేయాలనే లక్ష్యంతో యుద్ధానికిదిగినట్లు వెల్లడించారు.

## భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం

### యుఎస్ విదేశాంగమంత్రి మార్కో రూబియో



**వాషింగ్టన్, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుభాకాంక్షలు తెలిపారు. భారత్-అమెరికా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగాఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే ఇందుకు కారణమని చెప్పారు. రక్షణ, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ, అంతరిక్షం, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సహకారం మరింత విస్తరిస్తోందని తెలిపారు. భారత్, అమెరికా ప్రజల మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తోందని రూబియో పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం రెండు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని, అంతకు మించి విస్తరించి ఉందని స్పష్టం చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఢిల్లీతో పరస్పర సహకారానికి వాషింగ్టన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భవిష్యత్తులోనూ భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా ఎదురుచూస్తోందని తెలిపారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్.. భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య స్నేహ బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సింగపూర్ ప్రభుత్వం భారత్‌తో తమకున్న వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేస్తూ.. ఇరు దేశాల మధ్య డిజిటల్ కనెక్టివిటీ, గ్రీన్ ఎనర్జీ, రక్షణ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

## పోటీ పరీక్షార్థులకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

### జనగణనలో అందరూ భాగస్వాములు కావాలి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ యువతకు కీలక ప్రకటన చేశారు. దేశంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు మధ్యతరగతి, పేద కుటుంబాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్న ప్రధాని మోడీ వారిపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు పోటీ పరీక్షల కోచింగ్ కోసం కుటుంబాలు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. చదువుల కోసం యువత వారి కుటుంబాలకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి కూడా తగ్గాలని అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పటికే ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించుకుని ఫ్రీ ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, విద్యావేత్తల సేవలను ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం ఉపయోగించుకో నున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నాణ్యమైన విద్యా వనరులను అందుబాటులోకి తీసుకురావడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా ఆయన ప్రసంగంలో వివరించారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

## సిజెపి చీఫ్ ఇన్‌స్టాకు అంతరాయం.. ఎగసిన దుమారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ శనివారం కొద్దిసేపు నిలిచిపోయింది. ఈ విషయాన్ని సిజెపి ఫౌండర్ అభిజీత్ దీప్కే తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా వెల్లడించారు. సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిపివేయడాన్ని పిరికిపంద చర్యగా అభిజీత్ దీప్కే వర్ణించారు. అయితే, కొంతసేపటి తర్వాత అకౌంట్ తిరిగి ప్రారంభమైంది. ఈ అంశంపై దీప్కే స్పందించారు. సిజెపి అకౌంట్ నిలిచిపోవడానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఆయనతో పాటు సిజెపి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 6.16 గంటలకు సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు చేయడంతో 6.45 గంటలకు ఖాతా తిరిగి పునరుద్ధరించారు. భారత స్వాతంత్ర్య దినం రోజున తమ గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని దీప్కే ప్రకటించారు. ఇది పిరికిపందలు చేసిన చర్యగా అభివర్ణించారు.

## మహిళను హత్యచేసి వన్యమృగాలకు ఆహారం

### ఏడువేల కిలోమీటర్లు ఛేదించి అరెస్టుచేసిన పోలీసులు

**జైపూర్, ఆగస్టు 15:** రాజస్థాన్‌లో షాబాజ్ అనే వ్యక్తి ముస్కాన్ అనే మహిళను హత్య చేసి ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు ఆమె మృతదేహాన్ని అడవి మృగాలకు ఆహారంగా వేశాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగాఉన్న షాబాజ్ ఖాన్‌ను రాజస్థాన్ పోలీసులు సుమారు ఏడు వేల కిలోమీటర్లు వెంబడించి బీహార్‌లో అరెస్ట్ చేశారు. జూన్ 22న ముస్కాన్ దారుణహత్యకు గురైంది. షాబాజ్ ఖాన్,అతని సహచరుడుకలిసి ముస్కాన్‌ను రాంపుర కొండప్రాంతంలో హత్య చేశారు. అక్కడ ఆమె తలపై రాళ్లతో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని క్రూర మృగాలు తినివేస్తే ఆనవాళ్లు కూడా మిగలవనే దురాలోచనతో సమీపంలోని ఒక జంతువుల గుహవద్ద పడేశారు. అయితే మృతదేహం పూర్తిగాధ్వంసం కాకముందే పోలీసులుదానిని స్వాధీనంచేసుకున్నారు. అప్పటికే మిస్సింగ్‌కేసు పెట్టిన కుటుంబసభ్యులు అది ముస్కాన్ మృతదేహంగా నిర్ధారించారు.

## ఎర్రకోటవద్ద వందేమాతరం ఆలాపన చరిత్రాత్మకం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చరిత్రాత్మక ఘటన చోటుచేసుకున్నది. వందేమాతరం గేయాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారంపూర్తి స్థాయిలో ఆ గీతాన్ని పాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ గేయాన్ని పాడడం ఇదే మొదటిసారి. వందేమాతరం గీతాన్ని రాసి 150 యేళ్లు పూర్తి అవుతోంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం కీలక పాత్ర పోషించింది. దేశ ప్రజల్లో ఆ పాట జాగృతి నింపింది. ప్రధాని మోడీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఎర్రకోటపై వందేమాతర గీతం ప్రతిధ్వనించింది. తొలుత 21 గన్ సెల్యూట్ చేశారు. 1721 ఫీల్డ్ బ్యాటరీ సెర్మోనియల్ గ్రూపు ఈ సెల్యూట్ నిర్వహించారు. 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్ వాడారు. ఆర్మీ బ్యాండ్ ద్వారా వందేమాతరాన్ని ఆలపించారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గీతం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి వందేమాతరం గీతాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు.

## మోడీ హాగ్ సెటైర్లకు బిజెపి కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని విమర్శించే క్రమంలో, ప్రధాని నరేంద్రమోడీ విదేశాధినేతల్ని ఆలింగనం చేసుకోవడంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విదేశీ నేతల్ని కౌగిలించుకోవడం ఎలాంటి విదేశాంగ విధానం అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను కౌగిలించుకుని, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిని ప్రస్తావిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వ్యవహారం తిరిగి కాంగ్రెస్‌కే ఎదురుదెబ్బగా మారింది. బిజెపి నేతలు ఇందిరాగాంధీ గతంలో విదేశీ నేతల్ని ఆలింగనం చేసుకున్న ఫోటోలను షేర్ చేస్తున్నారు. తాజాగా బిజెపి ఎంపీ నిషికాంత్ దూబే తన ఎక్స్ అకౌంట్లో నెహ్రూకు సంబంధించిన పలు పాత ఫోటోలను పోస్టుచేశారు. నా లైబ్రరీలోని నెహ్రూగాంధీ కుటుంబానికి సంబంధించిన ఓ పుస్తకంలోని కొన్ని అయితే, దూబే వీటిని నెహ్రూ కిస్ ఫోటోలని నేరుగా పేర్కొననప్పటికీ, నెహ్రూ మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు చూపించే ఉద్దేశంతోనే వాటిని పోస్ట్ చేసినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ స్పందిస్తూ నెహ్రూ ఫోటోలు అసలు సందర్భం నుంచి విడదీసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఫోటోలో నెహ్రూ సోదరి విజయలక్ష్మి పండిట్ ఆయన చెంపపై ముద్దు పెడుతున్నారని, మరో ఫోటోలో ఆయన మేనకోడలు నయనతార సహగల్ ఉన్నారని ఆమె వివరించారు. 1962 మార్చిలో తీసిన మరో ఫోటోలో హోలీ సందర్భంగా జాక్వెలిన్ కెన్నెడీకి నెహ్రూ రంగులు పూస్తున్నట్లు ఉందని సుప్రియా శ్రీనేత్ తెలిపారు. క్రియేటివ్ కాంగ్రెస్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, సందీప్ దీక్షిత్‌లు ఆలింగనం చేసుకుని ప్రధాని మోడీపై వ్యంగ్యంగా స్పందించారు.

ఈ సమయంలోనే సందీప్ దీక్షిత్, రాహుల్ గాంధీతో నన్ను మెలోనీ అనుకోలేదుగా? అని ప్రశ్నించగా, రాహుల్‌గాంధీ నేను ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదని బదులిచ్చారు. దీని తర్వాత బిజెపి ఇందిరా గాంధీఫిడెల్ కాస్ట్రో, ఇందిరా గాంధీయాసర్ అరాఫత్ ఫోటోలను కూడా షేర్ చేసింది. నెహ్రూ తన సోదరి విజయలక్ష్మి పండిట్, మేనకోడలు నయనతార సహగల్, అమెరికా మాజీ ప్రథమ మహిళ జాక్వెలిన్ కెన్నెడీతో ఉన్న చిత్రాలు ఉన్నాయి.

## ప్రధానిమోడీ ఐర్లాండ్ పతాకం ధరించారంటూ కాంగ్రెస్ సెటైర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ధరించిన దుస్తులు ఇప్పుడు రాజకీయ దుమారానికి దారితీశాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే సమయంలో ఆయన ధరించే ప్రత్యేక శైలితో కూడుకున్న దుస్తులు, వైవిధ్యంగా కనిపించే తలపాగాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమోతుంటాయి. ఈసారి మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాని మోడీ ధరించిన జాకెట్‌పై అలంకరించిన పాకెట్ స్క్వేర్స్‌లో కనిపించిన జాతీయ పతాకం అమరిక ఇప్పుడు తీవ్ర వివాదానికి కేంద్రబిందువు అయింది. ప్రధాని మోడీ జాతీయజెండాను తలకిందులుగా అమర్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఘాటు విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలకు మరింత ఆజ్యం పోసింది. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలుపు రంగు కుర్తాపైజామాతో పాటు చాక్లెట్ బ్రౌన్ కలర్ స్లీవ్‌లెస్ జాకెట్, సాంప్రదాయ తలపాగాలను ధరించారు. ఈ జాకెట్‌పై ఆకుపచ్చ, తెలుపు, కాషాయం రంగులలో ఉన్న మూడు జేబు రుమాళ్లను అమర్చారు. సాధారణంగా భారత జాతీయ జెండా పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, దిగువన



ఆకుపచ్చ రంగులు ఉంటాయి. దీనికి భిన్నంగా మొదట ఆకుపచ్చ రంగు, ఆ తర్వాత తెలుపు, చివర్లో కాషాయ రంగుతో తలకిందులుగా కనిపించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు పవన్‌ఖేరా. ఆయన వేసుకున్న పాకెట్ స్క్వేర్ రంగులు, దాని అమరికను తప్పుపట్టారు. ప్రధాని మోడీ మన దేశ మువ్వన్నెల పతాకాన్నికాకుండా ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని ధరించారని ఆరోపించారు. ప్రధాని మోడీధరించిన జాతీయ పతాకం కూడా కుడి నుంచి ఎడమవైపుగా అమర్చినట్లు ఉందని పవన్ ఖేరా సెటైర్లు వేశారు. పైగా అది ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని పోలిఉందని, ప్రధాని మోడీ ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లుగా అనిపిస్తోందని తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో సెటైర్లు వేశారు.

## భారీ వర్షాలకు ఈశాన్య అరుణాచల్ అతలాకుతలం

**ఇటానగర్, ఆగస్టు 15:** అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల్లో నలుగురు చనిపోగా, ఐదుగురు సైనికులు గల్లంతయ్యారు. ఆ రాష్ట్రంలోని అప్పర్‌సుబన్‌సిరి జిల్లాలోని కియోజరింగ్‌బయాచింగ్ రోడ్డు మలుపు ప్రాంతం, దిబంగ్ లోయ జిల్లాలో ఈ ఘటనలు జరిగాయి. పసుపానీ ఆర్మీ క్యాంపులోని రెండు షెల్టర్లు కొట్టుకుపోయాయి. ఐదో గ్రెనేడియర్‌కు చెందిన ఏడుగురు జవాన్లు కొట్టుకుపోయారు. ఇద్దరిని రక్షించగా, ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైనవారిని హవల్దార్ ఉపేందర్, ఆర్మీ సిబ్బంది కుందన్, వినోద్, ఆదిత్య, సముందగా గుర్తించారు. ఐదో గ్రెనేడియర్, ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ 58వ బెటాలియన్, జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్‌కు చెందిన ఆర్‌సిసి, అరుణాచల్‌ప్రదేశ్ పోలీసులు, వలంటీర్లు సహాయక చర్యలు చేపట్టారు.అప్పర్‌సుబన్‌సిరి ప్రాంతంలో విరిగిపడిన కొండచరియల శిథిలాల కింద పలువురు కూరుకుపోయారు. టాడు బాకి, తాజి రాయ్, మర్కోష్ బసుమతారి, బాబుల్ అలీ మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు.

# సంక్షిప్త వార్తలు

## నేడు ప్రత్యేక పూజలకోసం తెరుచుకోనున్న శబరిమలై



**పతనంతిట్ట, ఆగస్టు 15:** శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారంనుంచి తెరుచుకోనుంది. చింగం మాసం పూజల కోసం ఈ ఆలయాన్ని తెరుస్తున్నట్లు ట్రావన్‌కోర్‌దేవస్వోమ్ బోర్డు వెల్లడించింది. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రధాని పూజారి ఆలయ తలుపులను తెరుస్తారు. తరువాత ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు దర్శనం అవకాశం కల్పించనున్నారు. ప్రసిద్ధి చెందిన శబరిమల ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం ఆదివారం సాయంత్రం సరిగ్గా 5 గంటలకు తెరుచుకోనుంది.

## ఉగ్ర సంస్థలతో లింకులు: బెంగళూరులో ఒకరి అరెస్టు

**బెంగళూరు, ఆగస్టు 15:** అఫ్ఘానిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఉగ్రమూకతో సంబంధం ఉన్న అసఫుల్ మాలిక్ అనే యువకుడిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) సభ్యుడితో కలిసి, ఆ సంస్థలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలపై సమాచారం అందడంతో అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసఫుల్ మాలిక్ బెంగళూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉగ్రవాద సంస్థలతో లింకులు బయటపడ్డాయి.

## విద్యుత్ తీగ తగిలి కరెంట్‌షాక్, టీచర్ మృతి

**భువనేశ్వర్, ఆగస్టు 15:** ఒక స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల సమయంలో విషాద సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఐరన్ పోల్‌కు విద్యుత్ వైర్ తగిలింది. దీంతో కరెంట్ షాక్‌తో టీచర్ మరణించగా, ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణ స్టాండ్‌కు ఐరన్ పైపు అమర్చడానికి వారు ప్రయత్నిస్తున్నప్పుడు అనుకోకుండా పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్‌కు అది తగిలింది. ఈ నేపథ్యంలో ఆ టీచర్, ముగ్గురు విద్యార్థులు విద్యుతాఘాతానికి గురయ్యారు.

## విద్యావ్యవస్థ లోపాలే నిరసనలకు కారణం: బాబారామ్‌దేవ్

**హారిద్వార్, ఆగస్టు 15:** విద్యార్థుల నిరసనలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియపై యోగా గురువు రామ్‌దేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతోన్న నిరసనలు, గందరగోళం లాంటివి విద్య, ఉపాధి వ్యవస్థల్లో ఉన్న తీవ్రమైన లోపాలను సూచిస్తున్నాయని అన్నారు. పతంజలి యోగపీఠంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా రామ్‌దేవ్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు వీధుల్లోకి వస్తున్నారని బాబా రాందేవ్ అన్నారు.

## మద్యం కొన్నా, అమ్మినా 5 వేలు ఫైన్

**చెన్నై, ఆగస్టు 15:** దేశవ్యాప్తంగా యువతను యుతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్,మద్యం అలవాట్లను కట్టడిచేసేందుకు తమిళనాడులోని ఓ గ్రామం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. విజుంతమావడి గ్రామం తీసుకున్న నిర్ణయం దేశ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. తమిళనాడులోని విజుంత మావడి గ్రామంలో పెళ్లి కాని యువకులకు మద్యం విక్రయించడాన్ని నిషేధించారు అక్కడి పెద్దలు. ఈ రూల్స్‌ను అతిక్రమిస్తే రూ.ఐదువేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

## కాశ్మీర్ ప్రజలు తిరుగాబుటు చేసేవారు: సిఎం ఒమర్

**శ్రీనగర్, ఆగస్టు15:** జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రత్యేక హోదాను రద్దు చేయకపోవడం, రాష్ట్ర హోదాను కేంద్రం తొలగించకపోయి ఉంటే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) ప్రజలు జమ్ముకశ్మీర్‌లో విలీనం కావడానికి తిరుగుబాటు చేసేవారని అన్నారు. శనివారం శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. 1947లో పాకిస్థాన్ నుంచి దండెత్తి వచ్చిన గిరిజన దుండగులకు వ్యతిరేకంగా పోరాడి, భారతదేశంలో భాగం కావాలని ఎంచుకున్న కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పిఒకెలోని ప్రస్తుత పరిస్థితులు సమర్థిస్తున్నాయని తెలిపారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో అనూహ్య రద్దీ


**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుససెలవులతో తిరుమలకు భారీగా భక్తులు తరలివచ్చారు. శనివారం కావడంతో ఉదయానికి తిరుమలలో లక్షమంది భక్తులు చేరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. సర్వదర్శనానికి సుమారు 24గంటల సమయం నిరీక్షణ తప్పడంలేదు. వైకుంఠం క్యూ కాంప్లెక్సులు నిండి శిలాతోరణం వరకు వెలుపల క్యూలైన్లు చేరాయి. శుక్రవారం 4.03 కోట్ల రూపాయలు హుండీ ఆదాయం చేకూరింది. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి అన్ని ఏర్పాట్లు చేస్తోందని చైర్మన్ బిఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆయన ప్రకటన చేశారు. భక్తులు తిరుమల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తమ యాత్రను ముందుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. దర్శన సమయంలో సంయమనం పాటిస్తూ, టిటిడి సిబ్బందికి సహకరించాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి వరకు 73,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,884 మంది తలనీలాలు సమర్పించారు. భారీ రద్దీ ఉన్నప్పటికీ భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సేవలు వంటి సౌకర్యాలను టిటిడి అధికారులు నిరంతరాయంగా అందిస్తున్నారు.



## అంకితభావ సేవలకు గుర్తింపు

### టిటిడిలో 38 మంది అధికారులు, 287 మంది ఉద్యోగులకు సన్మానం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో భక్తులకు విశేషంగా అంకితభావసేవలందిస్తున్న టిటిడి అధికారులు, ఉద్యోగులను శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఘనంగా గౌరవించారు. విధుల్లో ఉత్తమసేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 38 మంది అధికారులు, 281మంది ఉద్యోగులకు, స్కౌట్స్‌లో ఆరుగురు,ఎస్వీబిసిలో ఆరుగురు ఉద్యోగులకు ఐదుగ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఉద్యోగుల పిల్లలకు సంబంధించి ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 33మంది విద్యార్థులకు 4,116రూపాయలు, 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 29మంది విద్యార్థులకు 2,116 రూపాయలు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎస్వీసంగీత,నృత్య కళాశాల విద్యార్థినులు దేశభక్తి గీతాలతో చక్కటి నృత్యం ప్రదర్శించారు.



## బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌కు ప్రశంసాపత్రం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో బర్డ్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించడంలో సాటిగా ఉన్న డైరెక్టర్ డాక్టర్ జి.జగదీశ్‌కు టిటిడి అధికారులు ప్రశంసాపత్రం అందజేశారు. పుట్టుకతో వచ్చే అంగవైకల్యం, పోలియో ఎముకల సంబంధిత వ్యాధులకు పూర్తిగా బర్డ్‌లో ఉచితంగా,నామమాత్రపు ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందించడంలో డాక్టర్ జగదీశ్ సేవలు అమోఘంగా ఉన్నాయి. కృత్రిమ అవయవాలను కూడా అందిస్తున్న సేవలు మరింతగా రోగులకు సేవాభావంతో చేయడంపట్ల డైరెక్టర్‌ను శనివారం స్వాతంత్ర్యదినోత్సవాన టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అభినందించారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.కోటి విరాళం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు,పథకాలకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం తెలంగాణ హైదరాబాద్ కు చెందిన రక్షిత్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ సి.హెచ్.ఏ.పి.రామేశ్వరరావు, సాయిదడవ ఏపివి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఉద్దగిరి తాతారావులు కోటిరూపాయలు విరాళమిచ్చారు. టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు ఒక్కొక్కరు 50 లక్షలు రూపాయలు చొప్పున విరాళంగా అందించారు. దాతలు తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్.నాయుడుకు విరాళ డిడీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, రంగశ్రీ పాల్గొన్నారు.



## తిరంగా ర్యాలీతో నగర సంకీర్తన

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** శనివారం వేకువజామున పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం భక్తి పారవశ్యంతో మేల్కొంది. వేంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షి స్తూ భజన మండలి ఆధ్వర్యంలో శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. ఈ వారం ప్రత్యేకంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో కలిసి జరిగింది. బ్రహ్మ ముహూర్తంలో సంప్రదాయ వస్త్రధారణలో, నుదుట గోవింద నామాలతో భక్తులు గోవిందరాజస్వామి ఆలయం తూర్పు మాడవీధిలోని ఆం జనే య స్వామి ఆలయం వద్దకు చేరుకుని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీహరి నామస్మరణతో నగర సంకీర్తన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కళాకారులు ప్రవచనకర్త చంద్రమోళి, గుండాల గోపీనాథ్‌రెడ్డి,వాసు దేవ రెడ్డి, మునినాథ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, తిరుపాలాచారి, వాసు, కృష్ణంరాజు, కృష్ణయ్య, మధు, నాగేశ్వర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకల్లో ఆకర్షణగా 'డాగ్ షో'

### ప్రశంసలు కురిపించిన మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఆగస్టు 15 ప్రభాతవార్త :** ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ డాగ్ షో మైదానంలోని ప్రేక్షకులను విశేషంగా అలరించింది. తమ ధైర్యసాహసాలు, ఘ్రాణశక్తి, అత్యుత్తమ క్రమశిక్షణతో పోలీస్ డాగ్స్ ప్రదర్శించిన విన్యాసాలు ప్రతి ఒక్కరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఈ అద్భుత ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంత్రముగ్ధులయ్యారు. నేరాల దర్యాప్తు, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాల గుర్తింపులో డాగ్ స్క్వాడ్ సేవలు అత్యంత కీలకమని కొనియాడిన మంత్రి, ప్రతిభ కనబరిచిన హ్యాండ్లర్లు, శిక్షకులను ప్రత్యేకంగా అభినందించారు. వేడుకల ప్రారంభంలో 'మున్నా' అనే గోల్డెన్ రిట్రీవర్ డాగ్ మంత్రి అచ్చెన్నాయుడుకి నోటితో పూలగుత్తి అందించి స్వాగతం పలకగా, 'ద్రోణ' అనే బెల్జియన్ మాలినోయిస్ డాగ్ ఫ్లెక్సీని ఓపెన్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం హ్యాండ్లర్లు ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ 'మున్నా', 'బ్యూటీ' డాగ్స్ తమ క్రమశిక్షణను నిరూపించగా.. జిల్లాలో గంజాయి నిరోధానికి చేపట్టిన చర్యల్లో భాగంగా 'రాణి' అనే లాబ్రడార్ డాగ్ వాహన తనిఖీల్లో దాచి ఉంచిన మత్తు పదార్థాలను పసిగట్టే తీరును ప్రత్యక్షంగా ప్రదర్శించి ఆకట్టుకుంది.

# జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

### స్వాతంత్ర్య వేడుకల్లో పతాకావిష్కరణ చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్




స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్.ఆర్.ఐ. సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాలనుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ వెంట రాగా ప్రత్యేక వాహనంలో పెరేడ్ పరిశీలన చేశారు. జిల్లా ప్రజలనుద్దేశించి తమ సందేశాన్ని వినిపిస్తూ, మన జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెడదామని పిలుపునిచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభి వృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. భోగా పురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారుతుందని పేర్కొన్నారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కల్పిం చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యా చరణను అమలు చేస్తున్నామని అన్నారు. ఉదయం 8:59 గంటలకు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి వేదిక వద్దకు చేరుకోగా, 9:03 గంటలకు ముఖ్య అతిథి కొండపల్లి శ్రీనివాస్ సభా ప్రాంగణానికి విచ్చేశారు. 9:04 గంటలకు వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారం భమయ్యాయి. అనంతరం మంత్రిచే జాతీయ పతాకావిష్కరణ, పోలీసు బలగాల నుంచి గౌరవ వందన స్వీకరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మంత్రి జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం వినిపించారు. డాగ్ షో తిలకించి, శిక్షకులు ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. ప్రముఖులు, అధికారులు అతిథుల వద్దకు వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో భాగంగా ఉదయం 10:20 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ముందుగా వివిధ సేవా పతకాలను సాధించిన జిల్లా పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు కావాలి గ్రీష్మ, గాదె శ్రీనివాసుల నాయుడు, డాక్టర్ సురేష్ బాబు, మార్క్ఫెడ్ చైర్మెన్ కర్రోతు బంగార్రాజు, జేసి సేధు మాధవన్, ఏఎస్పీ సౌమ్యలత, డియార్వో సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికార యంత్రాంగం, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# ఎంసిలో జాతీయ స్థాయి ఉదరకోశ కార్యశాల

### వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ప్రముఖ ఉదరకోశ వైద్య నిపుణులు డాక్టర్ పెదవీర్రాజు



**విశాఖపట్నం, ఆగస్టు15 ప్రభాత వార్త :** వైద్య విద్య, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం,ప్రజాసేవలను సమన్వయం చేస్తూ ఆంధ్రా వైద్య కళాశాల కెజీహెచ్‌లో నిర్వహిస్తున్నరెండు రోజుల జాతీయ స్థాయి ఈయూఎస్ కార్యశాల 2026 ఉదారకోశ యువ వైద్యులు, నిరు పెద రోగులకు ఎంతగానో ఉపయోగ పడుతోందని నగరానికి చెందిన ప్రముఖ సీనియర్ ఉదరకోశ వైద్య నిపుణులు కెజీహెచ్ గ్యాస్ట్రోంట్రాలజీ విశ్రాంత విభాగా ధిపతి డాక్టర్ ఈధర పెద వీర్రాజు అన్నారు. విశాఖ పట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో "వైజాగ్ ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్ )2026: ఏ టూ జడ్ " పేరుతో రెండు రోజుల జాతీయ స్థాయి ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ కార్యశాల ను శనివారం కెజీహెచ్ ఉదరకోశా విభాగంఅధిపతి డాక్టర్ ఎల్ ఆర్ ఎస్ గిరినాథ్, ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఐ వాణి తో కలసి డాక్టర్ పెద వీర్రాజు ప్రారంభించారు.ఆగస్టు 16 ఆదివారం సాయంత్రం వరకూ నిర్వహించనున్న ఈ జాతీయ స్థాయి వర్క్ షాప్‌లో దేశంలోని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజీ, అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపీ నిపుణులు పాల్గొని ఆధునిక ఈయూఎస్ విధానాలపై ఉపన్యాసాలు, ప్రత్యక్ష లైవ్ కేసుల ప్రదర్శనలు, హ్యాండ్స్ ఆన్ శిక్షణ, సాంకేతిక చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ . కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి,ఏఐజీ హాస్పి టల్స్‌కు చెందిన డాక్టర్ సందీప్ లఖ్టా కియా, డాక్టర్ జహంగీర్ బాషా, విశాఖపట్నం సీనియర్గ్యాస్ట్రోఎం టరాలజిస్టులు , డాక్టర్ ఎ.వి. శివ ప్రసాద్ ఆంధ్ర మెడికల్ కళాశాల మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రలజిస్టులు డాక్టర్ టి. మోహన్ వంశీ, డాక్టర్ . ఎస్. శ్రీదేవి, డాక్టర్ డి. వంశీ యాదవ్, తది తర అధ్యాపకులు వైద్యులు వర్క్ షాప్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాకినాడలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

### ముఖ్యఅతిథిగా విచ్చేసిన డి.సిఎం పవన్ కళ్యాణ్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 15 ప్రభాతవార్త :** కాకినాడ భానుగుడి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు. వేదికకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణగావించినానంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లా డుతూ దేశ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి అని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలీసు జాగిలాలచే ప్రదర్శన అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సంబంధించిన శకటాల సందర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా లెజినోవా,లోక్ సభ,రాజ్యసభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం,కర్రి పద్మ శ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య,జగ్గం పేట టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ,పెద్దాపురంశాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ పట్టణ , గ్రామీణ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ, ప్రత్తిపాడు శాసన సభ్యులు సత్య ప్రభలతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డిఆర్ఓ డాక్టర్ పి తిప్పే నాయక్ కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివిధశాఖల జిల్లా అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వారికి, సాంస్కృతికకార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్‌ల చేతుల మీదుగా అందజేశారు. తదుపరి జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన 242 మంది అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

# పేదరిక నిర్మూలనకు చర్యలు: మంత్రి పార్థసారధి



**ఏలూరు, ఆగస్టు 15:** వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగు ణంగా పేదరిక నిర్మూలన, రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల మేరకు అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో 71,910 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, 44,114కుటుంబాలను 4,853 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద రూ.106.29 కోట్ల పెట్టుబడి సాయం అందిం చామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో ఎం. శ్రీదేవి, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం

### ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 610 మెగావాట్లు: సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షి ణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్పిడిసిఎల్)లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకా విష్కరణ అనంతరం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ భారతదేశం కోసం అసువులు బాసిన మహనీయుల అడుగుజాడల్లో నడుచుకుంటూ వారి ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. సంస్థ పరిధిలో 415 మెగావాట్ల సామర్థ్యంతో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటులో భాగంగా, ఇప్పటివరకు 214 మెగావాట్ల సామర్థ్యంతో 1.06 లక్షల గృహాలపై సోలార్ వ్యవస్థలను అమర్చామన్నారు. ఈ పనుల్లో భాగంగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ(ఎంఎన్ఆర్ఇ) గణాంకాల మేరకు రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల్లో 50 వేల సర్వీసులను గ్రిడ్ కు అనుసంధానం చేసిన తొలివిద్యుత్ పంపిణీ సంస్థగా ఎపిఎస్పిడిసిఎల్ నిలవడం గొప్ప విషయమన్నారు. సంస్థ పరిధిలో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 610 మెగావాట్ల సామర్థ్యంతో 1.35 లక్షల పంపుసెట్లకు. సౌర విద్యుత్తు సరఫరా పనులు త్వరితగతిన జరుగుతున్నాయని, అలాగే కుప్పం నియోజకవర్గంలో ఈ పథకంలో భాగంగా 32,106 పంపుసెట్లకు సోలార్ ప్లాంట్ల పనులను పూర్తి చేయడంతో 141 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు, జె. రమణాదేవి, ఎం. మురళీ కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జాయింట్ సెక్రటరీ యం. గోపాలకృష్ణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, సిజిఆర్ఎఫ్ చైర్పర్సన్ ఎ. శ్రీనివాస అంజనేయమూర్తి, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు


**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కౌసర్ బానో జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బందికి మరియు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు, యోధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈడీ కౌసర్ బానో మాట్లాడుతూ మనమందరం ఈనాడు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహానుభావుల, స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ త్యాగాల ఫలితమేనని గుర్తుచేశారు. విపత్తుల నిర్వహణ సంస్థ ద్వారా నిరంతరం ప్రజలకు సేవలందించడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. నిరంతరం సేవా దృక్పథంతో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న విపత్తుల నిర్వహణ సంస్థ ఉద్యోగులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

### లలితా జ్యువెలరీ ఐపిఒకు రంగం సిద్ధం

## రూ.1,700 కోట్ల సమీకరణ లక్ష్యం




**విశాఖపట్నం, ఆగస్టు 15, ప్రభాత వార్త:** లలితా జ్యువెలరీ మార్ట్ లిమిటెడ్ ఇనీషి యల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రంగం సిద్ధమైంది. ఆగస్టు 17న ప్రారం భమయ్యే ఐపీఓ ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కో రూ.5 ముఖ విలువ గల ఈక్విటీ షేరుకు రూ.190 నుంచి రూ.201 వరకు ధరల శ్రేణిని కంపెనీ ఖరారు చేసింది. కనీసం 74 షేర్లకు, ఆ తర్వాత 74 షేర్ల గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,200 కోట్ల వరకు తాజా షేర్లను జారీ చేయనుండగా, ప్రమోటర్ ఎం. కిరణ్ కుమార్ జైన్ రూ.500 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. మొత్తంగా రూ.1,700 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.'లలిత' బ్రాండ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి ప్రాంతాల్లో 51 నగరాల్లో 61 స్టోర్లు ఉన్నాయి. వీటిలో 45 స్టోర్లు టైర్2, టైర్3 నగరాల్లోనే ఉండటం విశేషం. బంగారం, వెండి, వజ్రాల ఆభరణాలను పోటీ ధరలకు అందిస్తూ సంస్థ దక్షిణ భారత మార్కెట్‌లో విస్తరణపై దృష్టి సారిస్తోంది.2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.25,023.93 కోట్ల ఆదాయం ఆర్జించగా, నికర లాభం రూ.1,009.82 కోట్లుగా నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం, లాభాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. చెన్నైలోని తిరుముడివాక్కం, కాంచీపురంలోని మరై మలైలో కంపెనీకి రెండు తయారీ కేంద్రాలు ఉన్నాయి. నాణ్యత, డిజైన్, పోటీ ధరలతో వినియోగదారులను ఆకర్షించడంతో పాటు కొత్త మార్కెట్లలో స్టోర్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది.ఐపీఓలో నికర ఆఫర్‌లో 50 శాతానికి మించకుండా అర్హతగల సంస్థాగత పెట్టుబడిదారులకు, కనీసం 15 శాతం సంస్థాగతేతర బిడ్డర్లకు,కనీసం 35శాతం రిటైల్ పెట్టుబడిదారులకు కేటాయింపు ఉంటుంది. ఆగస్టు 9, 2026న రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను కంపెనీ దాఖలు చేసింది.



## బొబ్బిలిలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్'

### ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన

**విజయనగరం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'బొబ్బిలి వీణ' తయారీకి కావలసిన ముడిసరుకు(పనస కలప) కొరతను గురించి రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) తీసుకువెళ్లిన సంగతి మనందరికీ విదితమే. కళలు, కళాకారులపట్ల ఎంతో గౌరవం కలిగిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి, అటవీ శాఖ అధికారులతో చర్చించి 'బొబ్బిలి వీణ'ల తయారీకి కావలసిన ముడిసరుకును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న పనసకలపను సేకరించి వీణల తయారీ కేంద్రాలకి సరఫరా చేయనున్నారు. అందులో భాగంగా, శనివారం బొబ్బిలి పట్టణం, గొల్లపల్లి గ్రామంలో ఉన్న వీణల తయారీ కేంద్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్' ఏర్పాటు చేసి కొంత ముడిసరుకును సరఫరా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, బీజేపీ జిల్లా కార్యదర్శి వేమకోటి గిరిబాబు, టీడీపీనాయకులు, కార్యకర్తలు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.


# ఇంద్రకీలాద్రి ఇఒకు ఉత్తమ పురస్కారం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వి.కె. సీనా నాయక్‌కు విశిష్ట పురస్కారంను మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అందుకున్నారు. దుర్గగుడి ఈఓగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సీనా నాయక్ భక్తుల సౌకర్యార్థం వినూత్నమైన మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇంద్రకీలాద్రిపై రద్దీ నియంత్రణ, నిరంతర భద్రతా పర్యవేక్షణ, శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు ప్రణాళికలు, మరియు ఆలయ పరిసరాల ఆధునీకరణలో ఆయన చూపిన చొరవను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది. భక్తుల పట్ల కఠినమైన జవాబుదారీతనం అమలు చేయడం, సేవా దృక్పథాన్ని పెంచడంలో ఆయన చేసిన ఉత్తమ పరిపాలనా సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈఓ సీనా నాయక్ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం పట్ల ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది మరియు భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**పంద్రాగస్టు వేడుకల్లో అలరించిన దేవదాయశాఖ శకటం:**
అమరావతి రాజధానిలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ శకటం అలరించింది. ముఖ్యమంత్రి సమక్షంలో స్వాతంత్ర దినోత్సవకార్యక్రమంలో ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖశకటం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ నగర్ లో సందర్శకుల సందర్శన నిమిత్తం కొలువుదీరింది.

**- అన్నదాన భవనానికి తుదిమెరుగులు:**
దుర్గమ్మవారి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రం తుది మెరుగులు దిద్దుకుంటోంది. శరన్నవరాత్రి ఉత్సవాల లోపే భక్తులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు, పాలకమండలితో కలిసి ఇఓ సంయుక్తంగా పరిశీలించారు.


కృష్ణానదిలో వరుణమంత్ర పఠనాలు చేస్తున్న ఋత్విక్కులు



ఉత్తమ ఉద్యోగులకు పురస్కారమందిస్తున్న ఇఓ, చైర్మన్, దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బి శిల్ప , బి సనీల వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116విరాళము శనివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి సేవలో వివిపిలు:**
దుర్గమ్మవారిని శనివారం సినీ నటులు బుల్లి రాజు రేవంత్ మరియు తన చెల్లెలు ఆశ్రిత తల్లిదండ్రులు శ్రీనివాసరావు దేవితో కలిపి శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు. ప్రముఖ హీరోయిన్ శ్రీ లీల శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు.


మంత్రి లోకేష్ నుంచి ఉత్తమ పురస్కారం అందుకుంటున్న ఇఓ

**ఇంద్రకీలాద్రిపై ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు:**
దుర్గమ్మవారి ఆలయంలో శనివారం ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇఓ వికె శీనా నాయక్ జాతీయ పతాకావిష్కరణ చేసి, ప్రగతి నివేదిక సమర్పించిన అనంతరం 50 మంది సిబ్బందికి ప్రోత్సాహక ప్రశంసా పత్రాల ప్రదానం కార్యక్రమంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, టి. హరికృష్ణ, టి. రమాదేవి, ఎస్.సరిత, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, ఇంజనీరింగ్ మరియు పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వేదోక్తంగా కొనసాగుతున్న వరుణయాగాలు:**
సకల లోకకల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఇంద్రకీలాద్రిపై త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములు" రెండవ రోజు శనివారం వేదోక్తంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాస్నానఘాట్ మరియు పాత యాగశాల వేదికలుగా విశేష పూజలు జరిగాయి.



## న్యాయం ఖరీదైన వాక్కు కాకూడదు

### హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయం కొందరికి మాత్రమే దక్కే, ఖరీదైన వాక్కు కాకూడదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లిసా గిల్ అన్నారు. కుల, మత, వర్గ, లింగ, ఆర్థిక స్థాయిలతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సత్వరమే, సులభంగా అందే వాక్కుగా ఉండాలని ఉద్ఘాటించారు. కోర్టులంటే కేవలం ఇటుకలు, రాళ్లతో కట్టిన కట్టడాలు కావని అవొక సజీవ న్యాయ దేవాలయాలని స్పష్టంచేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైకోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆమె ఎగురవేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, న్యాయవ్యవస్థలో మార్పులను జస్టిస్ లిసా గిల్ వివరించారు. జాతీయ జెండా కేవలం గాలికి ఎగరడం లేదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రతి స్వాతంత్ర్య సమరయోధుని ఆఖరి శ్వాసతో అది సగర్వంగా ఎగురుతోందని గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి ఎందరో మహనీయులు రాష్ట్రం పుట్టినిల్లని చెప్పారు.పాత కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూనే, అత్యవసర కేసులను వేగంగా విచారిస్తున్నట్లు జస్టిస్ లిసా గిల్ వెల్లడించారు. సీనియర్ సిటిజన్లు, అణగారిన వర్గాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. అందరి సమిష్టి కృషితో రాష్ట్రంలో పెండింగ్ కేసుల సంఖ్యను 2,50,363 నుంచి 2,45,438కి తగ్గించగలిగామన్నారు. కక్షిదారుల మధ్య రాజీకి లీగల్ సర్వీసెస్ అథారిటీ విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో ఖమీడియేషన్ ఫర్ ది నేషన్ఖ క్యాంపెయిన్ 3.0ను ఈనెల 1న ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు కంప్యూటర్ కమిటీ ఆధ్వర్యంలో ఖఅడ్వకేట్స్ సర్వీసెస్ పోర్టల్ఖను ప్రారంభించినట్లు జస్టిస్ లిసా గిల్ తెలిపారు. న్యాయ వ్యవస్థ సక్రమంగా నడిచేందుకు హైకోర్టు రిజిస్ట్రీ సిబ్బంది రాత్రి 8 గంటల వరకు శ్రమిస్తున్నారని చెప్పారు. వారి నిస్వార్థ సేవలను కోర్టు అభినందించిందన్నారు. న్యాయవాద వృత్తిలో సీనియర్లు, జూనియర్లకు మార్గదర్శనం చేయాలని జస్టిస్ లిసా గిల్ సూచించారు.

## ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

**విజయవాడ, ఆగస్టు 15, ప్రభాతవార్త ప్రతినిధి:** గుణదలలోని ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ (టెక్నికల్) ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్. వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు, ఇతర ఉన్నతాధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పి. పుల్లారెడ్డి మాట్లాడుతూ, ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ రంగ అభివృద్ధితో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద సుమారు 180 మెగావాట్ల సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వినియోగదారులకు డిస్కం వ్యయంతో సుమారు 2లక్షల ఇళ్లలో 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌వ్యవస్థలను ఏర్పాటుచేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు, అధికారులు మరియు సిబ్బందికి సీఎండీ పి. పుల్లారెడ్డి పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ నుంచి ఆన్‌లైన్‌లో విద్యుత్ సరఫరా నియంత్రణ ప్రక్రియను ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని కూడా సీఎండీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ

### బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** కులమత, ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ జరుపుకుంటున్నామని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చినా వందేమాతర గీతం ఆలపించడం ఆగిపోయిందని ఇవాళ ప్రధాని మోదీ వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని తెలిపారు. కొందరు సంకుచిత మతతత్వ ఆలోచనతో ఏ మాతకీ వందనం చెప్పకుండా భీష్మించుకుని కూర్చున్నారని మండిపడ్డారు. అధికారికంగా దేశం మొత్తం వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని మాధవ్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏక్ భారత్ నినాదం తీసుకొచ్చారని అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వంలో టెర్రరిస్టు, మావోయిస్టు కార్యకలాపాలు లేకుండా చేశారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.



## జూనియర్ వైద్యుల మౌన నిరసన

### డిమాండ్ల సాధనపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 15, ప్రభాత వార్త:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు వైద్య కళాశాల జూనియర్ వైద్యుల సంఘం, ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు మౌన నిరసన తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నినాదాలు, ఆందోళన ప్రదర్శనలు నిర్వహించకుండా మౌనంగా నిరసన తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం ఎందరో చేసిన త్యాగాలను స్మరించుకుంటూనే.. వైద్య రంగంలో సేవలందిస్తున్న యువ వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మౌన నిరసన తమ ఉద్యమం నుంచి వెనక్కి తగ్గినట్లు కాదని జూనియర్ వైద్యులు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై సంఘం ప్రతినిధులు, సభ్యులు సమావేశమై చర్చించారు. ఉద్యమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమాలోచనలు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ గౌరవానికి ప్రాధాన్యమిస్తూ ఈ రోజు మౌనంగా నిరసన తెలిపామని, తమ డిమాండ్ల సాధన కోసం తదుపరి రోజుల్లో కార్యాచరణ కొనసాగిస్తామని జూనియర్ వైద్యులు తెలిపారు.

## హోం శాఖ కొలువుల భర్తీకి వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** హోం శాఖ పరిధిలోని పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ, ఎస్‌పిఎఫ్, ఫోరెన్సిక్ విభాగాల్లో ఎస్ఐ, ఏ ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టుల భర్తీకి ఇటీవల వెలువడ్డ నోటిఫికేషన్‌కు సంబంధించి వయో పరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## ఎర్రకోట వేడుకలకు హాజరుకాని రాహుల్,ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎర్రకోట వద్ద శనివారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరుకాలేదు. ఇద్దరూ ఈ వేడుకలకు హాజరుకాకపోవడం వరుసగా ఇది రెండోసారి. ఎర్రకోట వద్ద ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. 80వ ఇండిపెండెన్స్ డే వేడుకలు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగాయి. సాధారణంగా ఈ వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష నేతలు, ఇతర పార్టీల నాయకులు కూడా హాజరవుతారు. గతంలో ఖర్గే, రాహుల్ సహా అగ్రనేతలు హాజరయ్యేవారు. కానీ, గత ఏడాది జరిగిన వేడుకలతోపాటు ఈరోజు జరిగిన వేడుకలకు కూడా ఇద్దరూ హాజరుకాకపోవడం ఆసక్తికరంగా మారింది. అధికారపక్షానికి, ప్రతిపక్షానికి మధ్య దూరం పెరిగింది అనేందుకు ఈ పరిణామం ఒక నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య వైరంగా మారిన సంగతి తెలిసిందే. మోడీపై, అమిత్ షాపై రాహుల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాహుల్ ఎర్రకోట వద్ద వేడుకలకు చివరిగా 2024లో హాజరయ్యారు. అప్పట్లో రాహుల్‌కు కేటాయించిన సీటుపై వివాదం నడిచింది. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి రెండో వరుసలో సీట్లు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఇలాంటి వేడుకల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలో సీటు కేటాయించాలి. ఆ తర్వాత నుంచి వేడుకలకు ఆయన హాజరవ్వడం లేదు. సాధారణంగా లోక్‌సభ ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ హోదా ఉంటుంది. ప్రోటోకాల్ అనుసరించాలి.

రాహుల్‌కు సీటు కేటాయింపులో ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదు. దీనిపై అప్పట్లో కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఆయనను అవమానించడం అంటే, ప్రజల్ని అవమానించినట్లే అని వ్యాఖ్యానించింది. అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం తమ పంతాలకు ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయాల్ని కాలరాస్తున్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.



## కాంగ్రెస్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపనపై విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర దిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా జరిగిన ఒక ఘటనపై స్వల్ప వివాదం మొదలైంది. వందేమాతరం గేయానికి ఇటీవల పూర్తిస్థాయి జాతీయ గేయంగా గౌరవం దక్కింది. జాతీయ గీతానికి ఉన్న గౌరవాన్నే కేంద్రం కల్పించింది. దీంతో తాజా స్వాతంత్ర్య దిన వేడుకల్లో వందేమాతరం ఆలపించడం తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకల సందర్భంగా కూడా వందేమాతరాన్ని నిర్వాహకులు ప్లే చేశారు. అది కూడా పూర్తి గేయాన్ని. అయితే, ఈ గేయం ప్లే అవుతుండగా సోనియా, రాహుల్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా, రాహుల్ కాస్త అటూ, ఇటూ చూడటం చేశారు. దీంతో పూర్తి వందేమాతరం గేయం ప్లే అవ్వకుండా ఆపేయాలంటూ సూచించారు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో పక్కనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఉన్నారు. సోనియా, ఖర్గే కాస్సేపు ఏదో చర్చించుకుంటున్నట్లు అక్కడి వీడియోలో కనిపించింది. దీంతో వారు వందేమాతరాన్ని ఆపేయమన్నారంటూ ప్రచారం జరగడంతో ఆ పార్టీ స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఖర్గే చాలాసేపు నిలబడే ఉన్నారు. పెద్దవయసు కావడంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించారని, ఆ గేయాన్ని ఆపాలని చెప్పలేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రచారానికి తెరపడింది. వందేమాతరం పూర్తి గేయాన్ని ఈ రోజు అధికారికంగా ఢిల్లీలోని ఎర్రకోటలో ప్లే చేశారు. మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఆర్మీ తమ బ్యాండ్‌తో వందేమాతరం గేయాన్ని ఆలపించింది. ఈ గేయానికి జాతీయ గీతం తరహా హోదా దక్కిన తర్వాత తొలిసారి దేశమంతటా పూర్తి వందేమాతరాన్ని భారతీయులు ఆలపించారు.

### ఇండోనేసియాలో భారీ భూకంపం.. 7.7 తీవ్రత

## 50 మంది మృతి, సునామీ హెచ్చరిక జారీ

**జకార్తా, ఆగస్టు 15:** ఇండొనేసియాలో భారీ భూకంపం సంభవించింది. తూర్పు ఇండొనేసియాలోని ఫ్లోరెస్ దీవి సమీపంలో శనివారం తెల్లవారుజామున 7.7 తీవ్రతతో భారీ భూకంపం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. భూకంపం ధాటికి భవనాలు దెబ్బతినగా 50 మంది మృతి చెందినట్లు, డజన్ల కొద్దీ ప్రజలు గాయపడినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. బలమైన ప్రకంపల నేపథ్యంలో కొద్దిసేపు సునామీ హెచ్చరిక జారీ చేయడంతో వందలాది మంది ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు పరుగులు తీశారు.

**భూకంపం ధాటికి భవనాలకు బీటలు**
అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) ప్రకారం.. ఫ్లోరెస్ దీవి ఉత్తర తీరానికి సమీపంలో భూకంప కేంద్రం నమోదైంది. ఎండె నగరానికి వాయువ్యంగా సుమారు 68 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం చాలా తక్కువ లోతులో సంభవించడంతో ప్రకంపనలు తీవ్రంగా కనిపించాయి. తర్వాత అదే ప్రాంతంలో 6.1 తీవ్రతతో సహా పలు ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కారణంగా పలు భవనాలు దెబ్బతిన్నాయి. ఆసుపత్రుల్లోని రోగులు సైతం భయంతో బయటకు పరుగులు తీశారు. కొన్ని భవనాల గోడలకు పగుళ్లు ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

**సునామీ హెచ్చరిక.. వందలాది మంది ప్రజల తరలింపు**
భూకంపం తర్వా ఇండొనేసియా వాతావరణ, వాతావరణ శాస్త్ర, భూభౌతిక సంస్థ (బిఎంకెజి) సునామీ హెచ్చరిక జారీ చేసింది. 0.5 మీటర్ నుంచి 3 మీటర్ల వరకు అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. తూర్పు నుసా తెంగారా, దక్షిణ సులవేసి, పశ్చిమనుసా తెంగారా ప్రాంతాలకు సునామీ ముప్పు ఉండొచ్చని హెచ్చరించారు. దీంతో ఫ్లోరెస్ దీవిలోని మౌమెరె సమా పలు ప్రాంతాల్లో ప్రజలు ఎత్తయిన ప్రదేశాలకు తరలివెళ్లారు. సముద్రం వెనక్కి వెళ్లి దృశ్యాలు కూడా కనిపించినట్లు స్థానికులు తెలిపారు. అయితే కొద్దిసేపటి తర్వాత సునామీ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. భూకంపం కారణంగా ఇద్దరు మృతి చెందినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య, భవనాలకు జరిగిన నష్టం తదితర వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఫిన్లాండ్‌లో శిక్షణ

### 17నుంచి 26వరకు 8 రోజులు పర్యటించనున్న ఉపాధ్యాయులు

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను దేశానికే తలమానికంగా తీర్చిదిద్దేందుకు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు విద్యారంగంలో గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ లో 37మందిని సింగపూర్ పంపించిన రాష్ట్రప్రభుత్వం... తాజాగా మరో 29మందిని ఫిన్లాండ్ పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 17 నుంచి 26వ తేదీ వరకు 8రోజులపాటు ఉత్తమ ఉపాధ్యాయులు ఫిన్లాండ్ లో పర్యటించనున్నారు. ఫిన్లాండ్ విద్యారంగంలోని ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేసి, రాష్ట్రంలో సహ ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. అంతర్జాతీయ వృత్తిపర అభివృద్ధి కార్యక్రమం పేరిట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక మార్గదర్శక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 2026 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 29 మంది టీచర్లను ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయంలో నిర్వహించే ప్రొఫెషనల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ లో పాల్గొనే అవకాశం కల్పించడం ద్వారా వారికి అంతర్జాతీయ అనుభవాన్ని అందించాలని నిర్ణయించారు.

**.ప్రపంచస్థాయి బోధనా పద్ధతులపై అధ్యయనం.**
ప్రపంచ స్థాయి విద్యా విధానాలు, వినూత్న బోధనా పద్ధతులను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడం, తద్వారా రాష్ట్రంలో బోధన, అభ్యసన నాణ్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయంతో కలిసి జాయ్ అండ్ ప్లే పద్ధతి ద్వారా.. ప్రారంభ బాల్య విద్య , ప్రాథమిక విద్య లో వృత్తిపర శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం ఫిన్లాండ్‌లోని అత్యుత్తమ విద్యా వ్యవస్థ ద్వారా మన ఉపాధ్యాయుల వృత్తిపర సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారిస్తుంది. ఇందులో బాలకేంద్రిత అభ్యసన , ఆనందదాయక బోధన , ఆట ఆధారిత విద్య వంటి వినూత్న తరగతి గది బోధనా పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తారు. మూడు దశల్లో ఈ ప్రోగ్రామ్ ను అమలుచేసే విధంగా కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

**మూడు దశల్లో ఉపాధ్యాయులకు శిక్షణ..**
మొదటి దశ ఓరియంటేషన్ విజయవాడలో 4 రోజుల ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. ముగ్గురు ఫిన్నిష్ నిపుణులు ఈ శిక్షణ నిర్వహించారు. ఫిన్నిష్ విద్యా వ్యవస్థ, బోధనా పద్ధతులు, డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ వర్క్, మెంటరింగ్ కార్యకలాపాలను పరిచయం చేశారు.

రెండోదశలో ఫిన్లాండ్‌లో ప్రత్యక్ష కార్యక్రమం (ఆగస్టు 17-26, 2026). ఫిన్లాండ్‌లోని టుర్కు, రౌమాలో 8 రోజుల ప్రత్యక్ష బోధన, అభ్యసన అనుభవాలను అందిస్తారు. తరగతి గదుల పరిశీలన, ప్రదేశ సందర్శనలు, ప్రారంభ బాల్య విద్యా కేంద్రాలు, ఉపాధ్యాయ శిక్షణా పాఠశాలల్లోని విద్యావేత్తలతో సంభాషణలు ఇందులో ఉంటాయి. మూడోదశలో ఆన్‌లైన్ మెంటరింగ్, ప్రాజెక్ట్ మద్దతు ఉంటాయి. శిక్షణ అనంతరం ఆన్‌లైన్ మెంటరింగ్ సెషన్లు. పాఠశాల ఆధారిత ప్రాజెక్టుల అభివృద్ధి, అమలు, బోధన మెరుగుదలపై దృష్టి. విశ్వవిద్యాలయ మెంటర్లు మూడు నిర్మాణాత్మక ఆన్‌లైన్ మెంటరింగ్ సెషన్ల ద్వారా నిరంతర మార్గదర్శనం చేసి, మద్దతు అందిస్తారు.

**కార్యక్రమ ముఖ్య లక్ష్యాలు.**అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విద్యా విధానాలు, బోధనా పద్ధతుల ద్వారా బేసిక్ అభ్యసన సూత్రాలు , విజ్ఞానం , నైపుణ్యాల పై అవగాహనను బలోపేతం చేయడం. అంతర్జాతీయ విద్యా విధానాలు , తరగతి గది వాతావరణాలు సాంస్కృతిక దృక్పథాలపై అవగాహన కల్పించడం. డిజిటల్ సాధనాలు, అభ్యసన వనరులను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని పెంపొందించడం. విద్యావేత్తలు, పాఠశాల విద్య లీడర్లలో నాయకత్వం, మెంటరింగ్ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం. అభ్యసన, ఆనందం, శ్రేయస్సును ప్రోత్సహించే వినూత్న పాఠశాల సంస్కృతులను ప్రోత్సహించడం. బాలకేంద్రిత, ఆనందదాయక బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు.


**ఫిన్లాండ్ శిక్షణతో ఉపయోగం ఏమిటి?..**
ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ఫిన్లాండ్‌లోని ప్రారంభ బాల్య విద్య, ప్రాథమిక విద్య (ఫిన్లాండ్‌లో 1 నుండి 6 తరగతులు) విధానంపై పరిచయం పొందుతారు. పాల్గొనేవారు శిక్షణ పూర్తయి స్వస్థలాలకు చేరుకున్నాక తమ సొంత అభివృద్ధి ప్రాజెక్ట్‌ను రూపొందిస్తారు. ఇందులో వారు ఫిన్నిష్ బోధనా విధానాలు, పద్ధతులను పరిశీలించి, వాటిని తమ పాఠశాలలు, తరగతి గదులు, అభ్యసన వాతావరణంలో అమలు చేస్తారు.

కార్యక్రమంలో రూపొందించిన పాఠశాల ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టులను పాల్గొనేవారు తొలుత తమ తమ పాఠశాలల్లో అమలు చేస్తారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జిల్లా, మండల స్థాయిలలో తోటి ఉపాధ్యాయులకు రీసోర్స్ పర్సన్లుగా, మెంటర్లుగా వ్యవహరిస్తారు. ఫిన్నిష్ విద్యా వ్యవస్థ నుండి నేర్చుకున్న ముఖ్య అంశాలను ఆంధ్రప్రదేశ్ విద్యా వాతావరణానికి అనుగుణంగా మార్చి అమలు చేస్తారు.

## మారుపేర్లతో ఒకే వ్యక్తికి బహుళ పాస్‌పోర్టులు

### యుఎస్ కాన్సులేట్ అధికారుల ఫిర్యాదుతో అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 15, ప్రభాతవార్త:** నకిలీ డాక్యుమెంట్లను ఉపయోగించి, మారుపేర్లతో ఒకే వ్యక్తి బహుళ భారతీయ పాస్ పోర్టులను తీసుకున్నాడు. వాటి ద్వారా విదేశీ ప్రయాణాలు సైతం చేశాడు. అమెరికా విసా దరఖాస్తుల సమయంలో ఒకే వ్యక్తి వేరువేరు పాస్‌పోర్టులను ఉపయోగించడంతో యుఎస్ కాన్సులేట్ అధికారులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నింది తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కోకా పేటలో నివాసం ఉంటున్న మోతుకుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి(55) అనే వ్యక్తి వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను కలిగి ఉన్నాడని యుఎస్ కాన్సులేట్ అధికారులు గత మార్చి 22వ తేదీన గచ్చిబౌలి పోలీ సులకు పిర్యాదు చేశారు. లక్ష్మీకాంత్‌రెడ్డి వేరువేరు పేర్లు, పుట్టినతేదీ, గుర్తింపు వివరాలతో వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను తీసుకోవడంతో పాటు వాటిని అమెరికా విసా దరఖాస్తు కోసం ఉపయోగించినట్లు యుఎస్ కాన్సులేట్ అధికారులు గుర్తించారు. యుఎస్ కాన్సులేట్ అధికారుల పిర్యాదు ఆధారంగా గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మోతు కుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి 1997లో నాంపల్లిలో ఉన్న సమయంలో తాను ఉంటున్న అడ్రస్‌తో చదువు రాదని చెప్పి మేధ ప్రసూన్‌కుమార్ రెడ్డి పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకున్నాడు. 2007లో ఇదే పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకున్నాడు. 2017లో తన అసలు పేరుతో మోతుకుపల్లి లక్ష్మీకాంతరెడ్డి అనే పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకొని కొన్ని రోజులు సదరు పాస్‌పోర్టు మీద అమెరికాకు సైతం వెళ్లి వచ్చాడు. వీటితో పాటు ఇదే వ్యక్తి నకిలీ రెసిడెన్షియల్ సర్టిఫికేట్లు, డేట్ ఆఫ్ భర్త్ సర్టిఫికేట్లు పెట్టి ముద్దనోళ్ల లక్ష్మీకాంత్ పేరుతో మరో పాస్‌పోర్టు సైతం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు సికింద్రాబాద్ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి సదరు పాస్‌పోర్టు దర ఖాస్తు పత్రాలను పోలీసులు సేకరించారు.


లక్ష్మీకాంత్‌రెడ్డి (ఫైల్)

## సిన్సినాటి ఓపెన్‌లో ఏడు సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ వీనస్ ఓటమి



**ఒహియో:** ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన వీనస్ విలియమ్స్ సిన్సినాటి ఓపెన్ తొలి రౌండ్‌లో కొలంబియన్ క్వాలిఫయర్ ఎమిలియానా అరాంగో చేతిలో 6-2, 6-2 తేడాతో ఓటమి చవిచూడటంతో, ఆమె సింగిల్స్ ఓటముల పరంపర 13 మ్యాచ్‌లకు చేరింది.

46 ఏళ్ల అమెరికన్ క్రీడాకారిణి వైల్డ్‌కార్డ్ ద్వారా డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో లిండ్నర్ టెన్నిస్ సెంటర్‌లోని గ్రాండ్‌స్టాండ్ కోర్టులో విలియమ్స్‌ను ఓడించడానికి 25 ఏళ్ల అరాంగోకు ఒక గంట ఐదు నిమిషాలు పట్టింది. విలియమ్స్ ప్రారంభ గేమ్‌లోనే తన సర్వ్‌ను కోల్పోయి, నిరంతరం ఒత్తిడి తెస్తున్న ప్రత్యర్థిపై తిరిగి పుంజుకోవడానికి చాలా కష్టపడింది. అరాంగో తనకు లభించిన ఐదు బ్రేక్‌పాయింట్ అవకాశాలలో నాలుగింటిని సద్వినియోగం చేసుకుని, తన మొదటి సర్వ్‌తో 71 శాతం పాయింట్లను గెలుచుకుంది. మరోవైపు, విలియమ్స్ తనకు లభించిన ఏకైక బ్రేక్ అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోలేక, తన మొదటి సర్వ్ పాయింట్లలో 41 శాతం మాత్రమే గెలుచుకుంది. ఆరంభంలోనే ఆధిక్యం సాధించడం తన ఆందోళనను తగ్గించి, నియంత్రణను కొనసాగించడానికి సహాయపడిందని అరాంగో అన్నారు. రెండో రౌండ్‌లో అరాంగో తదుపరి డిఫెండింగ్ ఛాంపియన్ మరియు టాప్ సీడ్ అయిన ఇగా స్వియాటెక్‌తో తలపడనుంది.

## భారత్ శుభారంభం

### హాకీ వరల్డ్ కప్‌లో వేల్స్‌పై తీన్మార్ విజయం



**నెదర్లాండ్స్:** ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ 31 తేడాతో వేల్స్‌ను చిత్తు చేసింది. గ్రూప్‌డీలో భాగంగా శనివారం నెదర్లాండ్స్, ఆమ్ స్టెల్వీన్‌లోని వాజెనర్ హాకీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్(10వ, 42వ నిమిషం) డబుల్ గోల్స్‌తో సత్తా చాటగా, సుమిత్(7వ నిమిషం) ఏకైక గోల్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. వేల్స్ తరపున వెల్ష్ సామ్(55వ నిమిషం) ఏకైక గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. తొలి క్వార్టర్‌లో రెండు గోల్స్ నమోదు చేసింది. ఏడో నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను సుమిత్ గోల్‌గా మలిచి 1-0తో శుభారంభం అందించాడు. మరో మూడు నిమిషాల వ్యవధిలోనే రెండో పెనాల్టీ కార్నర్ లభించగా, హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచి భారత్ ఆధిక్యాన్ని 2-0తో డబుల్ చేశాడు. రెండో క్వార్టర్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో గోల్స్ నమోదు కాలేదు. మూడో క్వార్టర్ చివర్లో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించగా, హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని 3-0తో మూడింతలు చేశాడు. ఆఖరి క్వార్టర్‌లో వేల్స్ ఆధిపత్యం చెలాయించింది. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకొని భారత్‌పై ఎదురుదాడికి దిగింది. ఈ క్రమంలో ఆ జట్టుకు 55వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ లభించింది. వెల్ష్ సామ్ గోల్‌గా మలిచి ఆ జట్టు ఖాతా తెరిచాడు.

## ది హాండ్రెడ్ టోర్నీ.. సన్‌రైజర్స్ ఔట్

### ఫైనల్‌కు సూపర్ జెయింట్స్

**కెన్నింగ్టన్ ఓవల్(లండన్):** ది హాండ్రెడ్ 2026 టోర్నీలో సన్‌రైజర్స్ లీడ్స్ పోరాటం ముగిసింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన సన్‌రైజర్స్ లీడ్స్ 20 పరుగుల తేడాతో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ చేతిలో ఓటమిపాలైంది. ఈ పరాజయంతో సన్‌రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, అద్భుత విజయం సాధించిన సూపర్ జెయింట్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్





చేసిన సూపర్ జెయింట్స్ 100 బంతుల్లో 4 వికెట్లకు 186 పరుగులు చేసింది. పాల్ వాల్టర్(80), హెన్రీచ్ క్లాసెన్(63) హాఫ్ సెంచరీలతో రాణించగా, కెప్టెన్ జోస్ బట్లర్(33) విలువైన పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో బ్రైడన్ కార్స్, మాథ్యూ పాట్స్, నాథన్ ఎల్లిస్ తలో వికెట్ తీసారు. అనంతరం సన్‌రైజర్స్ 100 బంతుల్లో 7 వికెట్లకు 166 పరుగులే చేసి ఓటమిపాలైంది. ర్యాన్ రికెల్టన్(54 నాటౌట్), హ్యారీ బ్రూక్(49) రాణించినా ఫలితం లేకపోయింది. సూపర్ జెయింట్స్ బౌలర్లలో జోష్ టంగ్(4/26) నాలుగు వికెట్లు తీయగా, సోనీ బేకర్(2/39) రెండు వికెట్లు పడగొట్టాడు. లియామ్ డాసన్‌కు ఒక వికెట్ దక్కింది. మ్యాచ్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 26 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63 పరుగులు చేసి మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌కు భారీ స్కోర్ అందించడంతో సన్‌రైజర్స్ ఓటమి చెందాల్సి వచ్చింది.





## విజయం దిశగా బంగ్లా

### తొలి టెస్టులో తేలిపోయిన ఆస్ట్రేలియా

**డార్విన్:** ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 161 పరుగులు చేసింది. క్రీజులో కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(19 నాటౌట్) ఉన్నాడు. మార్నస్ లబుషేన్(31), స్టీవ్ స్మిత్(44) కీలక భాగస్వామ్యాన్ని అందించారు.

బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మూద్(2/33) రెండు వికెట్లు తీయగా, తైజుల్ ఇస్లామ్, మెహ్‌ది హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 351/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ మెహ్‌దీ హసన్(154 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీతో రాణించాడు. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో, నజ్ముల్ హొస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీతో చెలరేగిపోయారు. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్(6/89) ఆరు వికెట్లు తీయగా, మిచెల్ స్టార్క్(2/79) రెండు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ తలో వికెట్ తీసారు. దాంతో బంగ్లాదేశ్‌కు 228 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. భారీ లోటుతో శనివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ అదే తడబాటు కొనసాగించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో లబుషేన్, స్మిత్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. లబుషేన్‌ను తైజుల్ ఇస్లామ్ ఔట్ చేయగా, స్మిత్‌ను మెహ్‌దీ హసన్ మిరాజ్ పెవిలియన్ చేర్చి హాఫ్ సెంచరీని అడ్డుకున్నాడు. కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్), అలెక్స్ క్యారీ(19 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా మూడో రోజు ఆటను ముగించారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే ఆసీస్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ఇద్దరూ సెంచరీలతో చెలరేగి భారీ లక్ష్యం నమోదు చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా గట్టెక్కలేదు.

## శ్రీలంక టెస్ట్ సిరీస్‌లో తొలి రోజు భారత్ 288 పరుగులు

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఘనంగా మొదలెట్టింది. గాలే వేదికగా శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్(178 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 131 బ్యాటింగ్) అజేయ శతకంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 73 ఓవర్లలో 2 వికెట్లకు 288 పరుగుల భారీ స్కోర్ చేసింది. వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు 77 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్(32) దురదృష్టకర రీతిలో రనౌట య్యాడు. శ్రీలంక అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత తప్పిదంతో జైస్వాల్ బలయ్యా డు. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కెఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. దీంతో టీమిండియా 27 ఓవర్లలో 101/1 స్కోర్ చేసేటప్పటికి వర్షం తో గంటన్నర తర్వాత రెండో సెషన్ మొదలైంది. రాహుల్, పడిక్కల్ తమ జోరును



కొనసాగించారు. ఈ క్రమంలో పడిక్కల్ 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్ 127 బంతుల్లో 77 పరుగలతో హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో టీమిండియా 197/1 స్కోర్‌తో టీ బ్రేక్ వెళ్లింది. ఆఖరి సెషన్‌లో రాహుల్ బ్యాటింగ్ కొనసాగించలేక రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. క్రీజులోకి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రాగా కేశర నువంత బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసి పడిక్కల్ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే గిల్(16) నిరాశపర్చాడు. ప్రబాత్ జయసూర్య బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి పంత్ రాగా వర్షం అంతరాయం కలిగించింది. కాసేపటి తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా పంత్(27 బ్యాటింగ్), పడిక్కల్ దూకుడుగా ఆడారు. అజేయంగా 52 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు.

# వాణిజ్యం

## పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై విధిస్తున్న విండ్‌ఫాల్ గెయిన్స్ పన్నును ప్రభుత్వం తగ్గించింది. శనివారంనుంచి ప్రారంభమయ్యే పక్షం రోజులకు కొత్త పన్ను రేట్లు అమల్లోకి రానున్నాయి. డీజిల్ ఎగుమతులపై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.25.50 నుంచి రూ.24కు తగ్గించారు. ఏటీఎఫ్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.22 నుంచి రూ.19.50కు తగ్గించారు. పెట్రోల్ ఎగుమతులపై పన్నును పూర్తిగా ఎత్తివేశారు. ఆగస్టు 3న లీటరుకు



రూ.3.50గా ఉన్న ఈ పన్ను ఆగస్టు 15 నుంచి సున్నాగా అమలవుతుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దేశీయ వినియోగం కోసం విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం ఉన్న పన్ను రేట్లలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, దేశీయంగా ఇంధన లభ్యతను పెంచేందుకు ప్రభుత్వం మార్చి 27న డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై ఎగుమతి సుంకాన్ని విధించింది. అనంతరం ప్రతి రెండు వారాలకు ఒకసారి రేట్లను సవరించింది. మే 16 నుంచి పెట్రోల్ ఎగుమతులపైనా ఈ పన్నును విధించడం ప్రారంభించింది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడంతో, ఎగుమతిదారులు ధరల వ్యత్యాసం ద్వారా అనూహ్య లాభాలు పొందకుండా నిరోధించడంతో పాటు దేశీయ మార్కెట్లో పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతను నిర్ధారించడమే విండ్‌ఫాల్ ట్యాక్స్ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.



## టాటాసన్స్ ఏజీఎంపై అనిశ్చితి!

### ట్రస్టుల్లో నెలకొన్న వివాదాలే కారణమా?

**ముంబయి, ఆగస్టు 15:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ ఏజీఎంపై అనిశ్చితి నెలకొంది. 18న జరగాల్సిన ఈ సమావేశానికి కీలక వాటాదారు అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ ప్రతినిధిని నామినేట్ చేయలేకపోవడంతో ఏజీఎం నిర్వహణపై సందిగ్ధతనెలకొంది. మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నియంత్రణల కారణంగా ఎస్ఆర్‌టీటీ బోర్డు సమావేశాన్ని నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. మరో కీలక ట్రస్ట్ అయిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ తో కలిసి ఏజీఎంకు ప్రతినిధిని నామినేట్ చేయడం సాధ్యం కావడం లేదు.

ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమైన కోరం లేకపోతే సమావేశాన్ని వాయిదా వేయాల్సి రావచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కోరం కోసం ట్రస్టుల ప్రతినిధి తప్పనిసరిటాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లోని ఆర్టికల్ 86 ప్రకారం, ఏజీఎంలో కనీసం ఐదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాలి. ప్రస్తుతం ఎస్ఆర్‌టీటీకి టాటా సన్స్‌లో 23.56 శాతం, ఎస్‌డీటీటీకి 27.98 శాతం వాటా ఉంది. ఈ రెండు ట్రస్టులు కలిపి దాదాపు 66 శాతం వాటాను కలిగి ఉండటంతో ఆ నిబంధన వర్తిస్తుంది. షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికి టాటా సన్స్‌లో సుమారు 18.37 శాతం వాటా ఉంది. ఎస్ఆర్‌టీటీ బోర్డు సమావేశం నిర్వహించలేకపోవడానికి మేలో మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలే కారణమని తెలుస్తోంది. ట్రస్ట్ బోర్డు కూర్పుపై విచారణ పూర్తయ్యే వరకు ప్రతిపాదిత ట్రస్టీల సమావేశాన్ని వాయిదా వేయాలని కమిషనర్ ఆదేశించారు.

ఎస్ఆర్‌టీటీలో మొత్తం ఆరుగురు ట్రస్టీలు ఉండగా, వారిలో జిమ్మీ నావల్ టాటా, జహంగీర్ హెచ్.సి. జహంగీర్, నోయెల్ నావల్ టాటా ముగ్గురు జీవితకాల ట్రస్టీలుగా ఉన్నారని పేర్కొంటూ ఫిర్యాదు దాఖలైంది. అంటే మొత్తం బోర్డులో 50 శాతం మంది జీవితకాల ట్రస్టీలుగా ఉన్నారని, ఇది చట్టపరంగా అనుమతించిన 25 శాతం పరిమితిని మించింది. ఈ చట్ట సవరణ భవిష్యత్తులో జరిగే నియామకాలకు మాత్రమే వర్తిస్తుందని టాటా ట్రస్ట్స్ వాదిస్తోంది. ఎస్ఆర్‌టీటీ బోర్డు సమావేశం నిర్వహించేందుకు ఛారిటీ కమిషనర్ నుంచి అనుమతి లేకపోవడంతో, ఎస్‌డీటీటీతో కలిసి ఏజీఎంకు ప్రతినిధిని నామినేట్ చేయలేకపోతోందని తెలుస్తోంది. ఈనెల 18న జరగాల్సిన ఏజీఎంలో కోరంలేక వాయిదా పడితే, చట్టబద్ధమయిన ఏజీఎం జరిగే వరకు చంద్రశేఖరన్ డైరెక్టర్‌గా కొనసాగుతారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

## సెటిల్‌మెంట్ విధానంలో సమగ్ర మార్పులకు సెబీ..!



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తన సెటిల్మెంట్ విధానంలో మారులు చేస్తోంది. సెటిల్మెంట్ మొత్తాన్ని లెక్కించే విధానాన్ని సరళీకరించడం, రూ.10 లక్షల వరకు సెటిల్మెంట్ మొత్తమున్న కేసులకు ఫాస్ట్రాక్ విధానం, షోకాజ్ నోటీసు జారీకి ముందే సెటిల్మెంట్ నోటీసు ఇవ్వడం, సెటిల్మెంటుకు దరఖాస్తు చేసుకునే గడువును 90 రోజులకు పెంచడం వంటివి ఉన్నాయి. గతంలో సెటిల్మెంట్ దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి, పరిస్థితులు మారితే తదుపరి దశలో మరోసారి సెటిల్మెంట్కు అవకాశం కల్పించడాన్ని కూడా ప్రతిపాదించింది. గత రెండేళ్లలో దాఖలైన, తిరస్కరణకు గురైన లేదా ఉపసంహరించుకున్న సెటిల్మెంట్ దరఖాస్తులను సెబీ పరిశీలించింది. కొత్త విధానం అమల్లోకి వస్తే ఈ వ్యత్యాసం సుమారు నాలుగు రెట్లకు తగ్గే అవకాశం ఉందని సెబీ అంచనా వేస్తోంది. రూ.10 లక్షల వరకు సెటిల్మెంట్ మొత్తం ఉండే కేసులకు ఫాస్ట్రాక్ విధానాన్ని తీసుకురావాలని సెబీ ప్రతిపాదించింది. షోకాజ్ నోటీసు జారీ అయిన తర్వాత సెటిల్మెంటుకు దరఖాస్తు చేసుకునే గడువును ప్రస్తుత 60 రోజుల నుంచి 90 రోజులకు పెంచాలని ప్రతిపాదించింది. గతంలో సెటిల్మెంట్ దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి కూడా తదుపరి దశలో మరోసారి అవకాశం ఇవ్వాలని సెబీ ప్రతిపాదించింది. అదనంగా 20 శాతం సెటిల్మెంట్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. బహుళ విచారణలకు సంబంధించిన అదనపు 20 శాతం ఛార్జీని తొలగించడంతో పాటు, అనుచిత లబ్ధి తిరిగి చెల్లింపుపై వడ్డీని కూడా ప్రామాణీకరించాలని సూచించింది.

## ఐదు ఐపిఒలు..రూ. 5499 కోట్లు సేకరణ లక్ష్యం

**ముంబయి, ఆగస్టు 15:** భారత స్టాక్ మార్కెట్లో ఐపీఓల సందడి కొనసాగుతోంది. ఇప్పటికే ఈ ఏడాది మెయిన్‌బోర్డు నుంచి ఏకంగా 42 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ. 54,378 కోట్లు సమీకరించగా వచ్చే వారం 5 కంపెనీలు బిడ్డింగ్ ప్రారంభిస్తున్నాయి. ఈనెల 17 నుంచి 21 మధ్య ఈ 5 కంపెనీలు కలిపి సుమారు రూ. 5499.32 కోట్లను సమీకరించనున్నాయి. ఈ 5 ఐపీఓల్లో హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ అతిపెద్దది. 5 కంపెనీలు సమీకరించే నిధుల్లో ఈ కంపెనీ వాటానే 47 శాతంగా ఉంది. తర్వాతి స్థానం లలితా జువెల్లరీ మార్ట్‌ది. 17న రెండు కంపెనీల ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ రూ. 2600 కోట్లు సమీకరించేందుకు ఐపీఓకు వస్తోంది. ఇష్యూధర రూ. 5760 మధ్య ఉంది. సుమారు రూ. 2600 కోట్ల మేర నిధుల్ని సమీకరించనుంది. గడువుతేదీ 19 గా ఉంది. లలితా జువెల్లరీ మార్ట్ ఐపీఓ కూడా 17న ప్రారంభం కానుండగా, ఇష్యూ ప్రైస్ రూ. 190-201 గా ఉంది. రూ. 1700 కోట్ల వరకు నిధుల్ని సమీకరించనుంది. 19వ తేదీనే తుదిగడువు. ఇతర చిన్న ఐపీఓలు చూస్తే ఆగస్ట్ 18న శంకేష్ జువెల్లర్స్, సన్‌షైన్ పిక్చర్స్ ఐపీఓలు ప్రారంభం కాబోతున్నాయి. శంకేష్ జువెల్లర్స్ రూ. 367.18 కోట్లు సమీకరించాలని లక్ష్యంకాగా ఇష్యూధర రూ. 88 93 గా ఉంది. 20 లాస్ట్ డేట్. సన్‌షైన్ పిక్చర్స్ షేర్ ప్రైస్ బ్యాండ్ రూ. 342 360 మధ్య ఉంది. ఇది రూ. 282.14 కోట్లు సమీకరించనుంది. ఆగస్ట్ 19న గాజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్మెంట్ రానుంది. దీని లాస్ట్ డేట్ ఆగస్ట్ 21 గా ఉంది. కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 550 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ. 152-160 గా ఉంది. ఇదే సమయంలో గత వారం సబ్‌స్క్రిప్షన్ జరిగిన 5 కంపెనీలు వచ్చే వారం స్టాక్ ఎక్స్చేంజీల్లో లిస్టింగ్ కానున్నాయి. ఈ 5 కంపెనీలు సుమారు రూ. 7478.69 కోట్ల మేర నిధుల్ని సమీకరించాయి.




## పన్ను చెల్లింపుదారుల విదేశీ ఆస్తుల వెల్లడికి 'ఫాస్ట్-డి' పథకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** చిన్న పన్ను చెల్లింపుదారుల విదేశీ ఆస్తుల వెల్లడికి సంబంధించిన ఫారిన్ అసెట్స్ ఆఫ్ స్మాల్ ట్యాక్స్‌పేయర్స్-డిస్క్లోజర్ స్కీమ్ రూల్స్, 2026ను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు నోటిఫై చేసింది. ఈ పథకంపై పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించేందుకు వివరణాత్మక ఎఫ్ఎక్యూలను కూడా విడుదల చేసింది. పథకం పరిధి2026 ఆర్థిక చట్టంలోని నాలుగో అధ్యాయం కింద ఫాస్ట్ డిఎస్‌ను స్వచ్ఛంద వెల్లడింపు విధానంగా తీసుకొచ్చారు. అర్హత కలిగిన పన్ను చెల్లింపుదారులు గతంలో వెల్లడించని విదేశీ ఆస్తులు, విదేశీ ఆదాయం లేదా ఆదాయపు పన్ను రిటర్నులో సరిగ్గా చూపించని విదేశీ ఆస్తులను నిర్దేశిత పన్ను లేదా రుసుము చెల్లించి వెల్లడించవచ్చు. ఈ పథకం 2026 ఆగస్టు 16 నుంచి అమల్లోకి రానుంది. డిక్లరేషన్లను 2026 డిసెంబర్ 31 వరకు దాఖలు చేయవచ్చు. ఆస్తుల విలువను 2026 మార్చి 31 నాటి విలువ ఆధారంగా లెక్కిస్తారు. ఆర్ఎన్ఓఆర్ నిర్దిష్ట నివాస నిబంధనలను పాటించే రెసిడెంట్ పన్ను చెల్లింపుదారులతో




పాటు కొంతమంది నాన్‌రెసిడెంట్, రెసిడెంట్ బట్ నాట్ ఆర్డినరీ రెసిడెంట్ పన్ను చెల్లింపుదారులు కూడా ఈ పథకం కింద డిక్లరేషన్ దాఖలు చేయవచ్చు. గతంలో వెల్లడించని విదేశీ ఆస్తులు లేదా విదేశీ ఆదాయం మొత్తం విలువ రూ.1 కోటి వరకు ఉండాలి. పన్ను రికార్డుల్లో ఇప్పటికే ప్రతిబింబించినప్పటికీ, రిటర్నులోని సంబంధిత షెడ్యూళ్లలో సరిగ్గా ప్రకటించని విదేశీ ఆస్తులకు రూ.5 కోట్ల వరకు పరిమితి ఉంటుంది. రూ.5 కోట్లకు మించిన విలువ కలిగిన ఆస్తులు ఈ పథకం పరిధిలోకి రావు. రూ.1 కోటి వరకు విలువైన వెల్లడించని విదేశీ ఆస్తులు లేదా ఆదాయానికి 30 శాతం పన్నుతో పాటు అదే మొత్తానికి సమానమైన అదనపు మొత్తం చెల్లించాలి. అంటే మొత్తం భారం 60 శాతంగా ఉంటుంది. రెండో కేటగిరీలోకి వచ్చే, రిటర్నులో సరిగ్గా వెల్లడించని విదేశీ ఆస్తులకు రూ.1 లక్ష ఫ్లాట్ ఫీజు విధిస్తారు. డిక్లరేషన్లను ఎలక్ట్రానిక్ విధానంలో ఫారం1 ద్వారా దాఖలు చేయాలి. అనంతరం పన్ను శాఖ చెల్లించాల్సిన మొత్తాన్ని ఫారం2 ద్వారా తెలియజేస్తుంది. ఆ మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాలి. అవసరమైతే వడ్డీతో మరో రెండు నెలల వరకు గడువు పొడిగించే అవకాశం ఉంటుంది.

# పావ్‌బాజీ రుచులు

పావ్ అంటే బన్ను, భాజీ అంటే కూరగాయలు. వీటితో తయారయ్యే పావ్‌బాజీ.. మనందరికీ మహా ఇష్టం. చిన్న చిన్నగా చినుకులు పడుతుంటే. వేడి వేడిగా పావ్‌భాజీ తింటుంటే ఆహా.. ఎంత బాగుంటుందో.. వీధుల్లో దొరికే పావ్‌భాజీ రకాలు ఇంట్లోనే చేసుకుందామా !

## జైన్ పావ్‌బాజీ



**కావలసినవి:** కాశ్మీరీ మిర్చి-12, నూనె-టేబుల్ స్పూన్, వెన్న-మూడు చెంచాలు, జీలకర్ర-చెంచా, క్యాప్సికం ముక్కలు- అర కప్పు, టొమాటో ముక్కలు-రెండు కప్పులు, కారం-2 చెంచాలు, పావ్‌భాజీ మసాలా-ఒకటిన్నర చెంచా, ఉప్పు-తగినంత, సన్నగా తుంచిన క్యాలీఫ్లవర్, పచ్చి బఠాణీలు-ఒక కప్పు చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, బన్నులు-8, వేయించిన అప్పడాలు-8, నిమ్మరసం-చెంచా, **తయారీ:** కాశ్మీరీ మిర్చిని కొద్ది నీళ్లతో గ్రైండ్ చేసుకోవాలి. కడాయిలో నూనె, కొద్దిగా వెన్న వేసి వేడయ్యాక జీలకర్రను వేయించాలి. అందులో మిర్చి పేస్టు, క్యాప్సికం, టొమాటో ముక్కలు, అర కప్పు నీళ్లు,కారం, పావ్‌భాజీ మసాలా, ఉప్పు వేసి 5 నిమిషాలు ఉడికించాలి. తర్వాత క్యాలీఫ్లవర్ ఉడికించిన బఠాణీల గుజ్జు, కొత్తిమీర తరుగు వేసి మరో 5 నిమిషాలు ఉడికించాలి. మధ్య మధ్యలో కలియతిప్పుతూ, మెదుపుతూ ఉండాలి.



కడాయిలోరెండు చెంచాల వెన్న, పావు చెంచా పావ్‌భాజీ మసాలా వేసి రెండు వైపులా వేయించుకోవాలి. ఉల్లి, టొమాటో స్లయిసులు, నిమ్మ చెక్క, పాపడ్‌లతో ఈ జైన్ పావ్ భాజీ సూపర్‌గా ఉంటుంది.

## చీజ్ పావ్‌బాజీ

**కావలసినవి :** నూనె-3 చెంచాలు, బంగాళదుంపలు-3, టొమాటోలు-5, క్యారెట్-1, బీన్స్-6, ఉల్లిపాయలు-2, పచ్చిమర్చి-3, క్యాప్సికం-1, కాశ్మీరీ చిల్లీ పౌడర్-2 చెంచాలు, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్-చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, పసుపు-అర చెంచా, ధనియాల పొడి, గరం మసాలా-రెండు చెంచాల చొప్పున, పావ్‌భాజీ మసాలా, బన్‌లు-8, చీజ్-కప్పు, నెయ్యి-2 చెంచాలు,కొత్తిమీర తరుగు-అరకప్పు

**తయారీ :** బంగాళదుంపలు, టొమాటోలు,క్యారెట్ బీన్స్‌లను కడిగి ముక్కలు కోసి ఉడికించాలి. చల్లారాక మెత్తగా మెదపాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఉల్లి, పచ్చిమర్చి, క్యాప్సికం వేసి వేయించాలి. ఉడికించిన కూరగాయల మిశ్రమం, ఉప్పు, పసుపు, కారం, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్, ధనియాల పొడి, గరం మసాలా, పావ్‌భాజీ మసాలా,కొన్ని నీళ్లు వేసి కలియతిప్పి మగ్గనివ్వాలి. కొత్తిమీర, చీజ్ తరుగు వేసి దించేయాలి. పావ్‌ను నేతిలో వేయించాలి. వేడివేడిగా ప్లేటులో వడ్డించుకుని తినడమే తరువాయి.

## ముంబై పావ్‌బాజీ..

**కావలసినవి :** బన్నులు-8, వెల్లుల్లి ముక్కలు-2 చెంచాలు, ఉల్లి, క్యారెట్, టొమాటో,క్యాబేజ్, పచ్చి బఠాణీలు- ఒక కప్పు చొప్పున, క్యాప్సికం-అర కప్పు, కట్ చేసిన క్యాలీఫ్లవర్-2 కప్పులు, బంగాళదుంపలు-4, పావ్‌భాజీ మసాలా-3 చెంచాలు, అల్లం మిర్చి ముద్ద-చెంచా, నిమ్మరసం-చెంచా, వెన్న-2 చెంచాలు, కొత్తిమీర తరుగు-పావు కప్పు, ఉప్పు-తగినంత నూనె- అరకప్పు.

**తయారీ :** ముందుగా బన్నులను నేతిలో వేయించి పెట్టుకోవాలి. కడాయిలో నూనె కాగాక వెల్లుల్లి, అల్లం మిర్చి ముద్ద వేసి కొన్ని క్షణాలు వేయించాలి. తర్వాత ఉల్లి, టొమాటో, క్యారెట్ ముక్కలు, క్యాలీఫవర్ , క్యాబేజ్, పచ్చి బఠాణీలు, బంగాళదుంప



ముక్కలు వేయించాలి. చివర్లో పావ్‌భాజీ మసాలా, ఉప్పు, నిమ్మరసం వేసికలియబెట్టి దించేయాలి. ఉల్లి, మిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే సరి ఘుమఘుమలాడే పావ్‌భాజీ సిద్ధం. ఎక్కువ మంది ఇష్టంగా తినే ముంబై రకం ఇది.

## పనీర్ పావ్‌బాజీ

**కావలసినవి :** బన్నులు-8, బంగాళదుపంలు-3, టొమాటోలు-4, ఉల్లిపాయలు-2, పనీర్- కప్పు, ఉప్పు-కొద్దిగా,అ ల్లం వెల్లుల్లి ముద్ద-చెంచా, కారం-చెంచా, పసుపు-అరచెంచా, నెయ్యి, కసూనతరి మెంతి,, పావ్‌భాజీ మసాలా-2 చెంచాల



చొప్పున, కొత్తిమీర తరుగు-అర కప్పు, నిమ్మరసం-చెంచా.

**తయారీ :** అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో కొద్దిగా నెయ్యి వేసి అందులో టొమాటో ముక్కలు, పచ్చి బఠాణీలు, క్యాప్సికం, ఉడికించి చిదిమిన బంగాళదుంప, అల్లం వెల్లుల్లి ముద్ద, ఉప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. అరకప్పు నీళ్లు పోసి మూత పెట్టాలి. మగ్గిన తర్వాత మెత్తగా మెదపాలి. కారం, పసుపు, పావ్‌భాజీ మసాలా, కస్తూరి మెంతి వేసి కలియతిపానపలి. చరివర్లో పనీర్ నెయ్యి, ఉల్లి, కొత్తిమీర తరుగు, నిమ్మరసం వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. అంతే నేతిలో వేయించిన బన్నుతో భాజీ అమోఘంగా ఉంటుంది.

## గ్రీన్ పావ్‌బాజీ



**కావలసినవి :** బన్నులు-6, క్యాలీఫ్లవర్, క్యాప్సికం, బూడిద గుమ్మడి ముక్కలు, సొరకాయ ముక్కలు, బచ్చలి కూర, కొత్తిమీర, ఉల్లి కాడల తరుగు, పచ్చి బఠాణీలు-అన్నీ ఒక కప్పు చొప్పున, వెల్లుల్లి ముక్కలు- 2 చెంచాలు, బంగాళ దుదంపలు-3, పచ్చిమిర్చి ముద్ద-చెంచా, ఉప్పు, పసుపు-చెంచా చొప్పున, వెన్న, నూనె-పావు కప్పు చొప్పున, పావ్‌భాజీ మసాలా-3 చెంచాలు,ఉల్లి ముక్కలు-కొద్దిగా, నిమ్మకాయ-ఒకటి. **తయారీ :** బన్నులను నేతిలో వేయించాలి. బూడిద గుమ్మడి, సొరకాయ, బంగాళదుంపల ముక్కలు, పచ్చి బఠాణీలనుకుక్కర్లో ఉడికించుకోవాలి. బచ్చలి, ఉల్లికాడల ముక్కలను రెండు నిమిషాలు ఒక పాత్రలో ఉడికించి చల్లారాక గ్రైండ్ చేయాలి. వెల్లుల్లి, మిర్చి ముద్దను నేతిలో వేయించాలి. అందులో సన్నగా తుంచిన కానయలీఫ్లవర్, క్యాప్సికం ముక్కలు వేసి అడుగంటకుండా కలియతిప్పుతూ మగ్గనివ్వాలి. ఇందులో కుక్కర్లో ఉడికించిన ముక్కలు,కొన్ని నీళ్లు, పసుపు వేయాలి. దగ్గర పడ్డాక బచ్చలి పేస్టు, పావ్‌భాదజీ మసాలా వేసి నిమిషం పాటే సన్న సెగ మీద ఉంచి దించేస్తే సరిపోతుంది. ఉల్లి,(నిమ్మ రసాలతో వహ్వా అనిపిస్తుంది. □





# మౌనగీతం

## మనసు తాకిన వేళ !

జనగణమన గీతం వింటేనే వళ్లు పులకరిస్తుంది. ఒక్కసారిగా దేశభక్తి భావం ఉప్పొంగు పోతుంది. జాతీయ గీతం విననంతనే మనసు ఉల్లాసంగా పరుగెడ్తుతుంది. ఏదో తెలియని భావం మనసంతా నిండిపోతుంది. అద జనగణమన స్వరం లయ బద్ధంగా విన్నపుడు. కానీ 500 మంది మూగ విద్యార్థులైతే ఎలాగైనా తమ కొచ్చిన భాషలో మౌనంగానే సంకేత భాషతో 'జనగణమన' పాడి జనాన్ని ఆకట్టుకున్నారంటే వారిలోని హృదయ స్పందనను అర్థం చేసుకోవచ్చు. వారి హావభావాలే మనిషిని కట్టిపడే సాయి. అంటే సంకేత భాషలో 'జనగణమన'కు మౌనగీతాలపన చేసి జనులందరినీ ఆకట్టుకున్నారంటే మాటలా! వారు అలా సంకేత గీతం పాడుతుంటే దేశభక్తికి అసలు సిసలు రూపం స్వరం కాదు, గళం కాదు, హృదయస్పందనేనని అర్థమౌతుంది. 'వందేమాతరం' అన్నా చెవి కోసుకునే వారు సైతం ఈసారి ఆ చిన్నారుల మౌనగీతాలను ఆలకించారు. 14 ఏళ్ల క్రితమే తొలిసారిగా ముంబయి బాల బాలికలు 'ఈ మౌనగీతా'నిక సంకేత భాషను జత కలిపి రక్తి కట్టించారు. వారిలో కొంత మంది వినికిడి లోపం ఉన్నవారు కూడా ఉండటం విశేషం. కేవలం వారి హృదయ స్పందన ద్వారానే మనసులోని భావాలకు దృశ్యరూపం ఇచ్చారు. వారి ప్రతి సంకేతమూ వారిలోని 'భారతీయత'ను తట్టి లేపింది. ముంబయిలోని ప్రత్యేక అవసరాలున్న 8 పాఠశాల ల్లోని కనీసం 500 మంది. సృజించిన దేశభక్తి గీతాలలో ఆనాటి థియేటర్‌లోని ప్రేక్షకులను కదలకుండా కూర్చోబెట్టింది. ప్రతి చిన్నారి చేతి కదలికల్లో దేశభక్తి భావ ధ్వనించింది. ప్రతి ఒక్కరిలోనూ భారతీయులుగా పుట్టా మన్న గర్వం తొణికిసలాడింది. ముద్రా గ్రూప్..బిగ్ సినిమాస్ కోసం 2011లో రూపొందించినది సైలెంట్ నేషనల్ ఆంథమ్ ప్రచారం వెనుక ఈ అద్భుతమైన ఆలోచన ఉంది. అంటూ బాబీ పవార్ ఆలోచన నుంచి ఈ ప్రయోగం పుట్టింది. సాధారణంగా జాతీయ గీతాన్ని వింటాం. కానీ ఈ సారి దాన్ని వినకుండా చూడాల్సి వచ్చింది. వినికిడి, మాటల లోపం ఉన్న చిన్నారులు సంకేత భాషలో 'జనగణమన'ను ప్రదర్శించారు. దేశభక్తిని వినిపించకుండా అనుభూతి చెందేలా చేసిన ఈ ఆలోచన ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. కాన్స్ లయన్స్‌లో ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ అవార్డులను సొంతం చేసుకుంది. □

## వాదన దేనికి?

అక్కాచెల్లెళ్లు, అన్నాతమ్ముళ్లు... తోబుట్టువులు ఎవరైనా చిన్న తనంలో పోట్లాడుకోవడం, ఆడుకోవడం సహజమే కదా! అయితే, ఇలా వాదించు కోవడం వల్ల పిల్లల్లో సామాజిక నైపుణ్యాలు, పద ఉచ్చరణ సమస్యను పరిష్కరించే టెక్నిక్‌లు, కాంపిటీటివ్ స్పిరిట్ నేషనల్ డెవలప్‌మెంట్ డిగ్రీ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ చేసిన పరిశోధనలు చెబుతున్నాయి. □



## సూర్యభగవానుడు

సూర్యభగవానుడిని ప్రత్యక్ష దైవంగా భావిస్తూ ఆరాధించడమనేది వేదం కాలం నుంచీ వుంది. అవతార మూర్తులు .. ఇంద్రాది దేవతలు .. మహర్షులు .. సూర్య భగవానుడిని ఆరాధించిన వారే. సూర్యోదయంతోనే సమస్త జీవులలో చైతన్యం మొదలవుతుంది. ఆ జీవరాశికి అవసరమైన ఆహారాన్ని ప్రకృతి ద్వారా సూర్యుడే అందజేస్తూ ఉంటాడు. అందువల్లనే సమస్త జీవుల జీవనానికి ఆధారభూతుడు సూర్యుడని చెబుతుంటారు. సూర్య కిరణాల వలన అనేక రకాల రోగకారక క్రిములు నశిస్తాయి. అందువలన అనారోగ్యం బారిన పడకుండా ఉండటం జరుగుతుంది. ఈ కారణంగానే తమ నివాస ద్వారం తూర్పు ముఖంగా ఉండేలా చూసుకుంటూ వుంటారు. సూర్య నమస్కారం వలన శారీరక పరమైన ఆరోగ్యం కలుగుతుంది. అలాంటిసూర్యభగవానుడి పూజకి, జాజి .. తామర .. పొగడ .. పున్నాగ .. మోదుగ .. గన్నేరు .. సంపెంగ .. గులాబి .. మందారాలు శ్రేష్టమైనవిగా ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. సూర్య నమస్కారాల వలన .. ఆయన పూజలో ఈ పూలను ఉపయోగించడం వలన ఆయురారోగ్యాలు కలుగుతాయని స్పష్టం చేస్తున్నాయి. □

# తెర



## 'VISA వింటారా సరదాగా' రెండో టీజర్ విడుదల

అక్టోబర్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలజు!శీతి వింటారా సరదాగ్గా చిత్రానికి సంబంధించిన రెండో టీజర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది.ఉద్భవ్ రఘు ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన తెరకెక్కిస్తున్న ఈ క్వీర్కీ క్యాంపస్ టు యుఎస్ఎ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ ఎస్. మరియు సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తుండగా.. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, హర్ష చెముడు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ రెండో టీజర్‌ను పూర్తిగా కథానాయకుడి కోణంలో రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేమ, అమ్మాయిల వల్ల అబ్బాయిల జీవితంలో ఎదురయ్యే ట్రబుల్స్ గురించి అశోక్ గల్లా పాత్ర తనదైన శైలిలో చెప్పే మాటలు యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సహజమైన సంభాషణలు, చురుకైన హాస్యం, మనసును హత్తుకునే ఎమోషన్స్‌తో సాగిన ఈ మోనోలాగ్ టీజర్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చింది.అయితే ఈ టీజర్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన మరో ఆసక్తికరమైన అంశం ఖలేజా చిత్రంలోని ఐకానిక్ డైలాగ్‌కు సంబంధించిన రిఫరెన్స్. ఊహించని విధంగా వచ్చిన ఈ రిఫరెన్స్ అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచింది.విజయ్ బుల్గానిన్ అందించిన సంగీతం టీజర్‌లోని ఎనర్జీకి మరింత బలాన్ని చేకూర్చింది. వినోదం, ప్రేమ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రూపొందిన జు!శీతి వింటారా సరదాగ్గా రెండో టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. VISA వింటారా సరదాగా చిత్రం అక్టోబర్ 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## 'ది ఇండియన్ బార్డర్' సాంగ్ లాంచ్



ఆర్ట్ ఇన్ హార్ట్ క్రియేషన్స్ బ్యానర్ మీద నివేద్య రెడ్డి నిర్మాణంలో డి.ఎస్. బాషా దర్శకత్వం వహించిన చిత్రంది ఇండియన్ బార్డర్ ఈ సినిమాలో కిరణ్ యార్లగడ్డ, ఆదర్ష్, మురళీ మోహన్, మేఘా శ్రీ, సింధు తులాని ముఖ్య పాత్రలను పోషించారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఈ మూవీ నుంచి ఓ దేశ భక్తి గీతాన్ని విడుదల చేశారు.జిందా రహేన్ తో డ్యూటీ అంటూ సాగే ఈ పాట అడ్రినల్ రష్‌లా ఉంది. గూస్ బంప్స్ ఇచ్చేలా, నరనరాల్లో దేశభక్తిని రగిల్చేలా ఈ పాట సాగింది. ఇక ఈ పాటకు ఆనంద్ మంత్ర బాణీ, డి.ఎస్. బాషా సాహిత్యం, శరవణ గాత్రం దేశ భక్తి గీతంగా మార్చే సింది .మేజర్ ఎస్‌పీఎస్ ఒబేరాయ్ మాట్లా డుతూ.. దేశం గురించి, సైన్యం గురించి సినిమా తీయడం ఆనందంగా ఉంది. అందరూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి. బయటి ఆహారాన్ని తినొద్దు. ఈ మూవీ మంచి విజయం సాధించాల్తి అని అన్నారు. హీరో, రైటర్ కిరణ్ యార్లగడ్డ మాట్లాడుతూ.. .. ది ఇండియన్ బార్డర్ ఈవెంట్ కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. పాలస్తీనా వార్ టైంలో ఈ కథ నాలో పుట్టింది. డి.ఎస్.బాషా గారు ఈ కథకు ఓ స్వరూపాన్ని తీసుకు వచ్చారు. ఎక్స్ ఆర్మీ పర్సన్స్, మీడియా మాకు ఎంతగానో సపోర్ట్ చేసింది. సైనికుడు చేసే త్యాగం, సైనికుడి భార్య చేసే త్యాగాల్ని ఇందులో చూపించాం. దర్శకుడు డి.ఎస్. బాషా మాట్లాడుతూ.. .. ది ఇండియన్ బార్డర్త్ ఈవెంట్‌కి వచ్చిన ఆర్మీ అధికారులు, మీడియా వారికి థాంక్స్.

## 'పొలిమేర 3'లో 'విరావి'గా కింగ్ అర్జున్



వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ సంయుక్తంగా నిర్మిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ పోలిమేర3 ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా విరావిగా ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించ బోతున్నారు. ఆగస్టు 15న అర్జున్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఓటీటీలో మా ఊరి పొలిమేర్థతో సంచలనం సృష్టించి, 'పొలిమేర 2'తో థియేట్రికల్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న ఈ మిస్టిక్ థ్రిల్లర్ ఫ్రాంచైజ్ ఇప్పుడు తదుపరి అధ్యాయంలోకి అడుగు పెట్టింది. ఈ ఇద్దరు అభిరుచి గల నిర్మాతల అసోసియేషన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'పొలిమేర 3' చిత్రాన్ని చిత్రబృందం ఘనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే ఈ అనౌన్స్‌మెంట్‌లో అతిపెద్ద సర్‌ప్రైజ్, ప్రధాన ఆకర్షణ యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా పొలిమేర్థ యూనివర్స్‌లోకి ఎంట్రీ ఇవ్వడం. బ్లాస్ట్ జోన్థ్‌తో భారీ విజయాన్ని అందుకున్న అర్జున్.. ఈ ఫ్రాంచైజ్‌లో పవర్‌ఫుల్ పాత్రలో కనిపించను న్నారు.అర్జున్ సర్జా పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన పాత్ర పేరును వెల్లడిస్తూ ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అర్జున్ 'విరావి' పాత్రలో నటిస్తున్నారు. పోస్టర్‌లో ఆయన కండలు తిరిగిన చేతిపై ఉన్న పరమశివుని త్రిశూలం, శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రం టాటూలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. త్వరలోనే ఫస్ట్ లుక్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటిం చారు. పొలిమేర, పొలిమేర2తో తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఐకానిక్ కొమురయ్య పాత్రలో సత్యం రాజేష్ మరోసారి అలరించనున్నారు. ఈ చిత్రంలో కామాక్షి భాస్కర్ల పాత్ర కూడా కీలకంగా ఉండనుంది., గెటప్ శ్రీను, బాలాదిత్య, రాకేందు మౌళి తదితర ప్రతిభావంతులైన నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు వచ్చిన పొలిమేర్థ చిత్రాల్లోనే అతిపెద్ద తారాగణంతో పొలిమేర 3 తెరకెక్కుతోంది.ఆసక్తికరమైన తారాగణం, ప్రతిభావంతమైన సాంకేతిక బృందం, భారీ స్థాయి కథాంశంతో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న అత్యంత ఆసక్తికరమైన చిత్రాల్లో పొలిమేర 3 ఒకటిగా నిలిచింది.



## 'అమీర్ లోగ్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్

'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన అమీర్ లోగ్ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ ఖ్‌స్పిరిట్ మీడియాఖ్ ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. 'లిటిల్ హార్ట్స్' డైరెక్టర్ సాయి మార్తాండ్ మాట్లాడుతూ.. .. అమీర్ లోగ్ సాంగ్స్ బాగున్నాయి. టీజర్, ట్రైలర్ నాకు నచ్చింది. సాయి స్మరణ్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఇష్టం. హరి నాకు మంచి మిత్రుడు. అని అన్నారు..' లిటిల్ హార్ట్స్' మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ మాట్లాడుతూ.. ..'అమీర్ లోగ్'లోని ఆర్టిస్టులందరూ సహజంగా అనిపిస్తున్నారు. నా మెంటర్ సాయి స్మరణ్. అతని మ్యూజిక్‌కి నేను చాలా పెద్ద ఫ్యాన్. హరి మంచి ఆర్టిస్ట్, సింగర్. ట్రైలర్ బాగుంది.దర్శకుడు రమణ రెడ్డి మాట్లాడుతూ.. .అమీర్ లోగ్ చిత్రం హైదరాబాద్ ప్రజలకు ప్రతీకగా ఉంటుంది. ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరినీ ఏడ్పిస్తాం, నవ్విస్తాం. కంటెంట్ మీదున్న నమ్మకంతోనే అందరం ఎంతో కాన్ఫిడెంట్‌గా, సంతోషంగా ఉన్నాం. ..నిర్మాత మాధవి రెడ్డి సోమ మాట్లాడుతూ.. అమీర్ లోగ్ సినిమా విడుదల చేస్తున్న స్పిరిట్ మీడియాకి థాంక్స్. ఆగస్ట్ 21న మా సినిమాని చూసి ప్రేక్షకదేవుళ్లు మమ్మల్ని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాన్థ అని అన్నారు..లైన్ ప్రొడ్యూసర్ శశి మాట్లాడుతూ.. .. అమీర్ లోగ్థ్‌కి ఈవెంట్లు చేయొద్దని ఒకప్పుడు అనుకున్నాం. కానీ ప్రతీ ఈవెంట్‌కి మాకు ఓ పండుగలా అనిపిస్తోంది. రమణ ఈ మూవీ కోసం అద్భుతమైన స్టోరీ సెట్ చేసుకున్నారు. అమీర్ లోగ్థ్‌ని అద్భుతంగా తెరకెక్కించారు. నటుడు విశ్వేందర్ రెడ్డి మాట్లాడుతూ...'అమీర్ లోగ్' సినిమా హైదరాబాద్ సోల్‌ను చూపిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ సాయి స్మరణ్ మాట్లాడుతూ.. ..'అమీర్ లోగ్' చిత్రంలో నాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీకి ఎస్వీకే కెమెరావర్క్, రోహిత్ పెనుమత్స ఎడిటింగ్, స్మరణ్ సాయి మ్యూజిక్ ప్రధాన ఆకర్షణ కానున్నాయి.

## 'శనార్తి' సినిమా గ్రాండ్‌గా లాంచ్



బ్లాక్‌బస్టర్ దర్శకుడు సంపత్ నంది విజయవంతమైన నిర్మాణ సంస్థ సంపత్ నంది టీమ్‌వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత, అభిరుచి గల నిర్మాత కె.వి. శ్రీధర్ రెడ్డితో కలిసి తన రెండవ చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమవుతోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న అఖిల్ రాజ్, యంగ్ ట్యాలెంటెడ్ నాగ దుర్గ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రానికి 'శనార్తి' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. ఇది తెలంగాణలో సాంప్రదాయకంగా పలకరించడానికి ఉపయోగించే పదం. టైటిల్ పోస్టర్‌లో ఒక చేయి పసుపు పచ్చ రంగులో, మరొక చేయి ఎరుపు రంగులో ఒకదాని కొకటి పట్టుకున్న రెండు చేతులు.. రెండు చేతుల మణి కట్టు చుట్టూ పవిత్రమైన జంధ్యాలు కట్టి ఉండగా, ఎరుపు రంగు వేసిన చేతికి సాంప్రదాయ ఎర్ర గాజుల దండ అలంకరించబడి ఉంది. రచయితగా, కథకుడిగా, షోరన్నర్‌గా తనకున్న ప్రతిభతో పేరుగాంచిన దర్శకుడు సంపత్ నంది 'ఓదెల' ఫ్రాంచైజీతో సహా విజయవంత మైన కథలు, ఫ్రాంచైజీలను రూపొం దించడంలో కీలక పాత్ర పోషించారు. శనార్తితో ఆయన అనుబంధం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతోంది. తన విలక్షణమైన సంగీతంతో శంసలు పొందిన సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతపరంగా మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. ఆయన అందించే సంగీతం సినిమాలోని గ్రామీణ నేపథ్యా నికి సరిగ్గా సరిపోవడమే కాకుండా చిత్రంలోని భావోద్వేగాలను పెంచు తోంది. హైదరాబాద్‌లోని రామా నాయుడు స్టూడియోలో ప్రముఖ సినీ ప్రముఖులు, చిత్ర బృందం సమక్షంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో సంపత్ నంది మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

## 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు'. పూజా కార్యక్రమం



పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన కన్నడ 'సుప్రీమ్ స్టార్ భార్గవ్ 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు' మూవీ.. కన్నడ చిత్ర పరిశ్రమలో 'సుప్రీమ్ స్టార్'గా పేరు తెచ్చుకున్న భార్గవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు'. ఈ చిత్రంలో మీనాక్షి జైస్వాల్, ఆరియా మీనన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు కన్నడ భాషల్లో కొసల క్రియేటివ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై ప్రొడ్యూసర్ బండి నాగరాజు నిర్మిస్తున్నారు. మద్దినేని రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ బి.వి. దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఎమోషనల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందనుంది. పూజా కార్యక్రమాలతో ఈ చిత్ర ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు క్లాప్ ఇవ్వగా, ఫిలింఛాంబర్ సెక్రటరీ కె. అశోక్ కుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు దశరథ్ తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. డైరెక్టర్ వీరశంకర్ స్క్రిప్ట్ అందజేశారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మద్దినేని రమేష్ మాట్లాడుతూ ఈ రోజు మా మూవీ పూజా కార్యక్రమాలకు అతిథులుగా వచ్చిన చదలవాడ శ్రీనివాసరావుకి, అశోక్ కుమార్‌కి, దశరథ్‌కి, ఇతర పెద్దలందరికీ కృతజ్ఞతలు. ప్రొడ్యూసర్ బండి నాగరాజు మాట్లాడుతూ ఒక మంచి కథతో మా సినిమాను నిర్మిస్తున్నాం. భార్గవ్ కన్నడలో ఎంతో కష్టపడి పేరు తెచ్చుకున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot Nos. 56,27,28, Block GXX, Auto Nagar, VIJAYAWADA-520007. Cellphone : 9848041146, RNI No.64861/96, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.